ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 272
సోమవారం 7 ఏప్రిల్ 2025 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## సన్‌రైజర్స్‌కు నాలుగో ఓటమి

సొంతగడ్డపై చెలరేగిన సిరాజ్

గిల్ అర్ధసెంచరీ గుజరాత్ హ్యాట్రిక్



07

# రమణీయం.. రాములోరి కల్యాణం

భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు

నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం వస్త్రాలు సమర్పించనున్న గవర్నర్



**భద్రాచలం, రోమింగ్ న్యూస్:** భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రామ నామ జపంతో భక్తులు పరవశించిపోతుండగా.. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకే స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళాశాసనం, అభిషేకం చేశారు. తదుపరి

మిగతా 2 లో



02

## అయోధ్య రాముడికి సూర్య తిలకం

రామ మందిరంలో ఆవిష్కృతమైన సుందర దృశ్యం



# సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం పాంబన్

తమిళనాడు అభివృద్ధికి కేంద్రం ఎంతో చేస్తోంది

తమ హయాంలోనే తమిళనాడుకు ఎక్కువ కేటాయింపులని వెల్లడి


తనకు లేఖలు రాస్తున్న తమిళ నేతలు తమిళంలో సంతకం సైతం చేయడం లేదని ఎద్దేవా

పాంబన్ వంతెనను ప్రారంభించిన ప్రధాని.. తమిళనాడు సీఎం గైర్హాజరు

సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం పాంబన్

వందేళ్ల క్రితం గుజరాతీ బిడ్డ నిర్మించాడు

ఇప్పుడు మళ్లీ గుజరాత్ బిడ్డకు అవకాశం: మోదీ



03

# పేదవారి కళ్లలో.. సన్నబియ్యం ఆనందం

ఆహార భద్రత కల్పించేందుకే రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం

ఈ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి జిల్లా సారపాకలోని గిరిజన లబ్ధిదారు ఇంట్లో సన్నబియ్యంతో భోజనం

ఆ కుటుంబానికి కొత్తవస్త్రాల అందజేత సీఎంతో పాటు భట్టి, తుమ్మల, పొంగులేటి



రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ పథకంతో పేదవారి కళ్లలో ఆనందం చూశానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదవాడి ఇంట్లో సన్నబియ్యంతో అన్నం రుచిని స్వయంగా చూడడం సంతోషంగా ఉందన్నారు.

**బూర్గంపాడు, రోమింగ్ న్యూస్:** రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, 80 శాతానికి పైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ నిరుపేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం

మిగతా 2 లో

## కృష్ణా ట్రైబ్యునల్ విచారణకు నేనొస్తా

తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం

న్యాయ బృందంతో సమీక్షలో మంత్రి ఉత్తమ్




**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** కృష్ణా జలాల్లో ఏపీ-తెలంగాణ వాటాల పంపిణీకి జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని ట్రైబ్యునల్-2 విచారణలకు తానూ స్వయంగా హాజరవుతానని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన జలసౌధలో సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ నేతృత్వంలో కృష్ణా ట్రైబ్యునల్-2 ఎదుట

మిగతా 2 లో



## సాగునీటి సరఫరాలో సర్కార్ నిర్లక్ష్యం

కాళేశ్వరంపై సర్కారు కక్షసాధింపు

వివక్షతోనే ప్రాజెక్టును ఎండబెట్టింది.. పిల్లర్ల మరమ్మతులు చేసి నీళ్లివ్వాలి


కేసీఆర్ సిస్టం మొత్తం రెడీ చేసి కాంగ్రెస్ సర్కారు చేతికి ఇచ్చారు

నేడు సరిగా వాడుకోలేకపోతున్నది... నీళ్లున్నా.. పంటలెండుతున్నయ్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు.. సొంత డబ్బులతో బిక్కబండకుంటకు సాగునీటికాల్వ తవ్వకం

03

## నేడు బనకచర్లపై చర్చ



బనకచర్లకు తెలంగాణ తీవ్ర వ్యతిరేకం.. కృష్ణా, గోదావరి బోర్డులకు ఫిర్యాదు

గోదావరి బోర్డు కోరినా బొల్లాపల్లి వివరాలివ్వని ఏపీ

ప్రాజెక్టుల అప్పగింత పైనా ఏపీ మెలిక

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయమై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై సోమవారం గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో కీలక చర్చ జరుగనున్నది.



సన్నబియ్యం కేంద్రమే ఇస్తే..

## దేశమంతా ఎందుకివ్వట్లేదు?

కేంద్ర మంత్రినన్న సంగతి మరిచి దిగజారి మాట్లాడొద్దు

బీజేపీ అధ్యక్ష పదవి దక్కడం లేదని ఆగమాగం

బండిపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ విమర్శలు

02

## వాస్తవాలను ఏఐతో ముడిపెడ్తరా?

రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేలా సీఎం రేవంత్ తీరు

ఇప్పటికైనా తెలివి తక్కువ పనులు మానుకోవాలి

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్

03



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
7 ఏప్రిల్
2025





# రమణీయం.. రాములోరి కల్యాణం





మొదటి పేజీ తరువాయి

ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు. ఉదయం 9.45 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. స్వర్ణ సింహాసనంపై స్వామివారిని, అమ్మవారిని ఆసీనులను చేశారు. కళ్యాణం సందర్భంగా భక్తరామదాసు చేయించిన నగలను వధూవరులకు ధరింపజేశారు.

తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి సతీసమేతంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీత ఉదయం 11.33 గంటలకు రామాలయానికి చేరుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. పూజల తర్వాత సీఎం దంపతులు 11.45 గంటలకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. అక్కడ జీలకర్రబెల్లం సమయంలో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రామయ్యకు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే వేద పండితులు ఉత్సవమూర్తుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. అనంతరం మూడు సూత్రాలతో కన్నుల పండువగా మాంగళ్య ధారణ నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తిలకించారు. అదేవిధంగా హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్ నాయుడు శ్రీసీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

### భారీగా తరలివచ్చిన భక్తజనం

సీతారాముల కల్యాణాన్ని తిలకించడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రతను తాళలేక అవస్థలు పడ్డారు. కల్యాణ మండపానికి చేరుకునే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయడంతో భక్తులు ఇక్కట్ల పాలయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే సమయంలో గంటపాటు సామాన్య భక్తులకు స్వామి వారి దర్శనాన్ని నిలిపివేశారు. ఒక మహిళా ఎస్సై అత్యుత్సాహం ప్రదర్శించారు. నిఘా వర్గాల సిబ్బందిని సైతం వెళ్లిపోవాలని హుకుం జారీ చేయడం గమనార్హం. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సీఎం రాకను చిత్రీకరించేందుకు ప్రయత్నించగా వారినీ ఆ ఎస్సై వెళ్లిపోవాలని హెచ్చరించారు. తమకు పాస్‌లు ఉన్నాయని చెప్పినా వినిపించుకోలేదు. చివరిలో కల్యాణ తలంబ్రాల కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది.


### నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం

కల్యాణం అనంతరం ఒక్క రామయ్యకు మాత్రమే నిర్వహించే విలక్షణ ఉత్సవం మహాపట్టాభిషేకం. ఏటా శ్రీరామ నవమి మరుసటి రోజు జరిగే ఉత్సవాన్ని శ్రీరామ మహాపట్టాభిషేకంగా పేర్కొంటారు. ఇందులో భాగంగా శ్రీరాముడికి ఆభరణాలతో పాటు రాజదండం, రాజముద్రిక, ఛత్రం, శంఖు, చక్రాలు, కిరీటం ధరింపజేస్తారు. సోమవారం నిర్వహించే ఈ పట్టాభిషేకానికి భద్రాచలం దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శ్రీరామ మహాపట్టాభిషేకానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

## అయోధ్య రాముడికి సూర్య తిలకం

### రామ మందిరంలో ఆవిష్కృతమైన సుందర దృశ్యం

**అయోధ్య, ఏప్రిల్ 6:** శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం అయోధ్యలోని రామమందిరంలో మనోహర దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. బాల రాముడి నుదుటిపై సూర్య తిలకం ఆవిష్కృతమయింది. సరిగ్గా మధ్యాహ్నం 12గంటలకు సూర్య కిరణాలు రామ విగ్రహం నుదిటిని తాకాయని, 4నిమిషాల పాటు ఆ దృశ్యం కొనసాగిందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. సూర్యకాంతితో రాముడికి మహా మస్తకాభిషేకం జరిగిందని తెలిపింది. ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనియాలతో చేసిన ప్రసాదాన్ని, ఫలాలతో చేసిన లడ్డూలను స్వామికి నివేదించారు.





# పేదవారి కళ్లలో.. సన్నబియ్యం ఆనందం

మొదటి పేజీ తరువాయి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ముత్యాలమ్మపేటకు చెందిన ఆదివాసీ కుటుంబం, సన్నబియ్యం లబ్ధిదారు బూరం శ్రీనివాసరావు ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భోజనం చేశారు. తొలుత తమ ఇంటికి చేరుకున్న ముఖ్యమంత్రికి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం రేషన్‌షాపు నుంచి తీసుకువచ్చిన సన్నబియ్యంతో వండిన అన్నంతోపాటు పాయసం, పులిహోర, తోటకూర పప్పు, గోంగూర చట్నీ, బెల్లం పానకం, ఇతర ఆహార పదార్థాలు వడ్డించారు. కాగా, భోజనం చేస్తున్న సమయంలో సీఎం ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారి కుటుంబ పరిస్థితులు, జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం పథకం తమ లాంటి పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందని వారు సీఎంకు తెలిపారు. మానవతా దృక్పథంతో నడిపిస్తున్న గొప్ప పథకమంటూ ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భోజనం అనంతరం ఆ కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు. వారికి నూతన వస్త్రాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

### ఇబ్బందుల్లో ఉన్నాం.. ఆదుకోండి

తమ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. లబ్ధిదారు తల్లి పద్మావతి మాట్లాడుతూ.. తన భర్త శంకరరావు జీసీసీ సేల్స్‌మేన్‌గా పనిచేసి 2015లో రిటైరయ్యారని, తన కుమారుడు ఏంఏ బీఈడీ చదువుకుని కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, తన కుమార్తె సుహాసిని చిన్నప్పటి నుంచి మానసిక ఇబ్బందులతోపాటు కనుచూపు లేక అవస్థలు పడుతోందని సీఎంకు చెప్పారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి.. వారి సమస్యలను పరిష్కారించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సుల వల్లే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఇంటికి భోజనానికి వచ్చారంటూ బూరం శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నిరుపేదలమైన తమ ఇంట్లో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ శ్రీరామ నవమిని తమ జీవితంలో మర్చిపోలేమని అన్నారు.

### మధుర జ్ఞాపకం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. "పేదవాడి ఇంట కంచంలో సన్నబియ్యం.. స్వయంగా రుచి చూశా. వారి కళ్లల్లో ఆనందాన్నీ చూశా. సారపాకలో లబ్ధిదారుల ఇంట సహపంక్తి భోజనం చేసి పథకం అమలును స్వయంగా పరిశీలించా" అంటూ ఎక్స్‌లో సీఎం ట్వీట్ చేశారు. దీంతోపాటు రాములోరి పెళ్లికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ఒక మధుర జ్ఞాపకమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. "కన్నుల పండువగా భద్రాద్రి వేడుకగా శ్రీ సీతారామస్వామి కల్యాణం కమనీయం. పల్లెపల్లెన పెళ్లి సందడి.. ఈ సీతారాముల కల్యాణ వైభోగం" అంటూ 'ఎక్స్'లో సీఎం పోస్ట్ చేశారు.




# కృష్ణా ట్రైబ్యునల్ విచారణకు నేనొస్తా

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రం తరఫున వాదనలను వినిపిస్తున్న న్యాయ బృందంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. న్యాయ బృందానికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. డాటా సేకరణ, క్షేత్రస్థాయి సమాచారం, పిటిషన్లను రూపొందించే విషయంలో న్యాయబృందానికి పూర్తి సహకారం అందించాలని, వారికి అవసరమైన రవాణా, బస సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునల్ విచారణల సందర్భంగా న్యాయ బృందానికి మంత్రి పలు సూచనలు చేశారు. "తెలంగాణ వాదనలు కేవలం గణాంకాల కోసం కాదు. న్యాయం కోసం జరిపే పోరాటం. రాష్ట్ర హక్కులను కాపాడుకునే తాపత్రయం" అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధంగా.. సాంకేతికపరంగా రాష్ట్రానికి న్యాయమైన వాటాలను దక్కించుకునేలా ట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలను వినిపించాలని న్యాయబృందాన్ని కోరారు. దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకు కాంగ్రెస్ సర్కారు కృతనిశ్చయంతో ఉందన్నారు. సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ఇటీవల జరిగిన విచారణ వివరాలను మంత్రికి వివరించారు. ఈనెల 15 నుంచి 17 తేదీల్లో జరిగే విచారణకు సర్వసన్నద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ హక్కుల సాధన కోసం ఇప్పటి వరకు జరిగిన విచారణల్లో తాము చేసిన వాదనలను, తాజా స్థితిగతులను వెల్లడించారు. తెలంగాణలో కృష్ణానది పరీవాహక విస్తీర్ణం, జనాభా, సాగునీటి సరఫరా సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, సమ కేటాయింపుల కోసం ట్రైబ్యునల్ ఎదుట వాదనలను వినిపిస్తున్నట్లు చెప్పారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారులు ఆదిత్యనాథ్‌దాస్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# నేడు బనకచర్లపై చర్చ

**బనకచర్లకు తెలంగాణ తీవ్ర వ్యతిరేకం.. కృష్ణా, గోదావరి బోర్డులకు ఫిర్యాదు**

**గోదావరి బోర్డు కోరినా బొల్లాపల్లి వివరాలివ్వని ఏపీ**

**ప్రాజెక్టుల అప్పగింతపైనా ఏపీ మెలిక**



**హైదరాబాద్, ఏప్రిల్ 6:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయమై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై సోమవారం గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో కీలక చర్చ జరుగనున్నది. ప్రత్యేకించి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా వరద జలాల తరలింపుపై చర్చ జరిగే అవకాశం ఉంది. జీఆర్ఎంబీ చైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, ఏపీ నుంచి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వర రావు తమ రాష్ట్రాల వాదనలు వినిపించనున్నారు. గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల తరలింపుతోపాటు నాగార్జున సాగర్ నుంచి కృష్ణా వరద జలాలను గుంటూరు జిల్లాలో నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్‌కు మళ్లిస్తామని ఏపీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే.

### ప్రాజెక్టుల అప్పగింతపైనా చర్చ

గోదావరి నది పరిధిలోని మొత్తం 16 ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను జీఆర్ఎంబీకి అప్పగించాలని 2021 జూలై 15న కేంద్రం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌మీద బోర్డు సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉంది. గోదావరిపై ఉన్న పెద్దవాగు ప్రాజెక్టు మాత్రమే రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అని, అది మినహా ఇతర ప్రాజెక్టులను అప్పగించే ప్రసక్తే లేదని తెలంగాణ తేల్చేసింది. తెలంగాణ ప్రాజెక్టులు అప్పగిస్తేనే తామూ అప్పగిస్తామని ఏపీ మెలిక పెట్టింది. 2021లో కేంద్రం విడుదల చేసిన గెజిట్ ప్రకారం తెలంగాణలో 11, ఏపీలో నాలుగు కలిపి గోదావరి బేసిన్‌లో మొత్తం 16 అనుమతి లేని ప్రాజెక్టులకు ఆయా రాష్ట్రప్రభుత్వాలు అనుమతి పొందాల్సి ఉంది. తెలంగాణలోని 11 ప్రాజెక్టుల్లో తొమ్మిది ప్రాజెక్టుల ఎనిమిది డీపీఆర్‌లను అనుమతి కోసం కేంద్రానికి సమర్పిస్తే ఆరింటికి టీఏసీ అనుమతులు లభించాయి. ఏపీ సర్కార్ మాత్రం తమ ప్రాజెక్టుల డీపీఆర్‌లను అనుమతుల కోసం కేంద్రానికి సమర్పించనే లేదు.

### బొల్లాపల్లి పై ఇవీ ఏపీ ప్రతిపాదనలు

రూ.80 వేల కోట్ల ప్రాథమిక అంచనాలతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు ద్వారా రోజూ రెండు టీఎంసీల చొప్పున 90 రోజుల్లో 180 టీఎంసీల మిగులు జలాలను తరలిస్తామని ఏపీ చెబుతోంది. అందుకు నాగార్జున సాగర్ కుడి కాల్వ సామర్థ్యం పెంచడం ద్వారా కృష్ణా నది వరద జలాలను తరలిస్తామని ఏపీ ప్రతిపాదన. అదే జరిగితే నాగార్జునసాగర్ కింద తమ ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉందని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేసింది. దీనిపై గోదావరి, కృష్ణా బోర్డులతోపాటు కేంద్ర జలశక్తిశాఖకూ ఫిర్యాదు చేసింది. దీంతో ఈ ప్రాజెక్ట్ డీపీఆర్, ఇతర వివరాలు సమర్పించాలని సమర్పించాలని జీఆర్ఎంబీ లేఖ రాసినా ఏపీ ఇంతవరకూ అందించలేదు.

# సన్నబియ్యం కేంద్రమే ఇస్తే.. దేశమంతా ఎందుకివ్వట్లేదు?

**కేంద్ర మంత్రినన్న సంగతి మరిచి దిగజారి మాట్లాడొద్దు**

**బీజేపీ అధ్యక్ష పదవి దక్కడం లేదని ఆగమాగం**

**బండిపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ విమర్శలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 6 :** తెలంగాణలో కేంద్రమే సన్న బియ్యం పంపిణీ చేస్తుందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. సన్న బియ్యం ఇచ్చేది బీజేపీనే అయితే.. దేశం మొత్తం ఎందుకు ఇవ్వట్లేదంటూ నిలదీశారు. బండి సంజయ్‌లో రోజురోజుకూ అభద్రతా భావం పెరిగిపోతోందని, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రాదని తెలిసి ఆగమాగమవుతున్నాడని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. బీజేపీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. కేంద్ర మంత్రి చెప్పులు మోసిన చరిత్ర సంజయ్‌దన్నారు. కాంగ్రెస్ సర్కారుపై నోటికి వచ్చింది మాట్లాడితే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. బండి సంజయ్‌కి దమ్ముంటే.. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 2 బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా ప్రధానిని ఒప్పించాలన్నారు. ఢిల్లీ పెద్దలకు భయపడే తెలంగాణ బీజేపీ నేతలు.. బీసీ మహా ధర్నాకు ముఖం చాటేశారని విమర్శించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తరహాలోనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీఆర్ఎసతో బీజేపీ.. లోపాయికారి ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మోదీ, అమిత్‌షాల వద్ద గుర్తింపు కోసం కేంద్ర మంత్రి అన్న సంగతి మరిచి.. సంజయ్ దిగజారి మాట్లాడుతున్నారన్నారు. హెచ్‌సీయూ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ మాట్లాడటం సరికాదని ఆయన పేర్కొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
7 ఏప్రిల్
2025





# బాలాజీ నగర్‌లో వైభవంగా సీతారామ కళ్యాణం



జనగామ, రోమింగ్ న్యూస్: జనగామ పట్టణంలోని మూడో వార్డు పరిధిలో ఉన్న బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. పూజారి ప్రసాద్ శర్మ ఈ వేడుక కార్యాన్ని శ్రీరాముని గొప్పతనాన్ని వివరించి కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో లగిశెట్టి పద్మావతి- కృష్ణమూర్తి ,దూడల శోభారాణి-రమేష్, బెలిదె స్వప్న- శ్రీధర్ గుప్తా, మోటె రేణుక -శ్రీనివాస్ ,దోసపాటి శ్రీలక్ష్మి -శ్రీనివాస్, గొరిగె శోభన-సంతోష్ దంపతులు కూర్చున్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణ దాత మెరుగు సుధాకర్ సుజాత దంపతులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దూడల రమేష్, శ్రీధర్ గుప్తా ,మోటె శ్రీనివాస్, దోసపాటి శ్రీనివాస్, పెండ్లి సత్తిరెడ్డి ,పిట్టల గణేష్ , ఎనగందుల సత్యనారాయణ,గొల్లపల్లి వెంకటరత్నం, సూడి సత్యనారాయణ, గోరిగె అయిలయ్య ,నర్మెట కృష్ణ, మాదారం సత్యనారాయణ, ,మంగ శంకర్ ,నరసింహారావు, దూడల శోభారాణి, బొడ్డు లక్ష్మి, దోసపాటి శ్రీలక్ష్మి, లోనే మంజుల, కల్పన, రేణుక, భాగ్యలక్ష్మి, టి. విజయ, మంగ మమత, సునీత, ఆలేటి పద్మ తదితరులు పాల్గొన్నారు.





## దళిత కుటుంబం ఇంట్లో భోజనం చేసిన బీర్ల



**గుండాల, రోమింగ్ న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మాసాన్ పల్లి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా దళిత కుటుంబంతో కలసి వారి ఇంట్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఇంట్లో మహిళలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పేద ప్రజలకు అందిస్తున్న సన్నబియ్యం ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారికి,ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

## పూర్ణగిరి శ్రీ సుదర్శన లక్ష్మీనృసింహుని కొండ చుట్టూ నడకకు ఏర్పాట్లు



భువనగిరి రూరల్, రోమింగ్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నమాత్ పల్లి గ్రామంలో గల పూర్ణగిరి శ్రీ సుదర్శన లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం రావి సురేష్ రెడ్డి సహకారంతో ఆలయ కొండ చుట్టూ మట్టి పోయించినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా రావి సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో తాను పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి మరియు ఆలయ ప్రధాన దాత మొసలి ఉదయ్ కుమార్, ప్రధానార్చకులు జ్యోషి పవన్ కుమార్ శర్మ, ఆలయ ధర్మకర్తలు సురపంగ పద్మ నర్సింహా, ఎల్లంల జంగయ్య యాదవ్, బత్తిని సుధాకర్ గౌడ్, పబ్బతి ఉప్పలయ్య మరియు మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య యాదవ్, గుడి సేవకులు కొత్తపల్లి నాగయ్య, కంబాలపల్లి రఘునాధ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రముఖ విద్యావేత్త, సమాజసేవకులు... కాసం అంజయ్య మృతి

### రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖుల సంతాపం



జనగామ, ఏప్రిల్ 6, (రోమింగ్ న్యూస్) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అనేక దశాబ్దాలుగా విద్యా దానం చేస్తూ "ప్రిన్సిపాల్ అంజయ్య సార్" గా గుర్తింపు పొందిన జనగామ జిల్లా కేంద్రానికి చెందిన కాసం అంజయ్య గుప్తా( 82) ఇక లేరు. ఆదివారం ఉదయం ఆయన కన్నుమూశారు. ఓజనగామ జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలలో ప్రముఖ విద్యావేత్తగా సమాజ సేవకులుగా, వ్యాపార రాజకీయ ఆధ్యాత్మిక రంగాల వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ మంచి గుర్తింపు పొందిన జనగామ ఏ. బి. వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొలి ప్రిన్సిపాల్ గా అంజయ్య సార్ సేవలు అనిర్వచనీయం. రాష్ట్రవ్యాప్తంగా ఎవరైనా ప్రముఖులను కలిసి మాది జనగామ అనగానే మీ అంజయ్య సార్ మాకు చాలా బాగా తెలుసు అని నేటి అన్ని వర్గాల ప్రముఖులు పేర్కొనడం పరిపాటి.

లయన్స్ క్లబ్ జనగామ చార్టర్ కార్యదర్శి, పూర్వ జిల్లా గవర్నర్ లయన్ గా విశేష సేవలు అందించిన కాసం అంజయ్య (82) ఆదివారం ఉదయం గం. 8.30 ని. లకు మృతి చెందారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న వీరు ఏప్రిల్ 6, ఆదివారం ఉదయం హైదరాబాద్ లో ప్రయివేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. వీరి పార్థివ దేహాన్ని 12 గం. ల వరకు జనగామ గీతా నగర్ లోని వారి స్వగృహం తీసుకువచ్చారు. వీరి మృతి వార్త తెలుసుకున్న జిల్లాకు చెందిన పుర ప్రముఖులు, వైశ్య పెద్దలు, లయన్స్ ప్రముఖులు రుమాల్ల సునీల్ కుమార్, ఎం. విద్యాసాగర్ రెడ్డి, తీగల మోహన్ రావు, కన్న పరశురాములు, పలువురు లయన్ నాయకులు అనేకమంది పూల మాలలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

1943 ఫిబ్రవరి 3 న జన్మించిన అంజయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా వాణిజ్య శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1966 లో అసిస్టెంట్ లెక్చరర్ గా వరంగల్ చందా కాంతయ్య మెమోరియల్ కళాశాలలో అధ్యాపక వృత్తి నారంభించి, కళాశాల ప్రిన్సిపాల్ గా ఎదిగారు. అనంతర కాలంలో జనగాంలో ఏ బి వి డిగ్రీ కళాశాల ప్రారంభ కాలంలో జన్మ భూమి పై ఉన్న మమకారం తో కళాశాల ప్రిన్సిపాల్ గా భధ్యతలు చేపట్టి దాని ఉన్నతికి 2001 లో పదవీ విరమణ చేసే వరకూ ఎనలేని సేవలు చేశారు.

లయన్స్ అంతర్జాతీయ స్వచ్చంద సేవా సంస్థ 1976 లో జనగామ లో స్థాపన జరిగిన సమయంలో లయన్స్ క్లబ్ జనగామ వ్యవస్థపాక కార్యదర్శిగా ప్రస్థానం ప్రారంభించి అనేక బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి 1989 లో జిల్లా గవర్నర్ పదవిని చేపట్టి విశేష సేవలు అందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో లయనిజం వ్యాప్తికి శ్రీకారం చుట్టిన అంజయ్య మార్గదర్శనంలో అనేక క్లబ్ లు విస్తరించారు. హిందీ ప్రేమి మండలి అధ్యక్షునిగా, అవొపా సంస్థ అధ్యక్షునిగా, ఆయా సంస్థల్లో నూ విశేష రీతిలో పని చేసి ఆవోపా సంస్థ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికై ఆర్యవైశ్యులకే కాకుండా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తన వంతు కృషి చేశారు.

### ప్రముఖుల సంతాపం

జనగామ పట్టణ ప్రముఖునిగా అన్ని వర్గాలతో మమేకమై ఉండే అంజయ్య మృతి తీరని లోటు అని రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖులు అనేకమంది విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్ల రాజేశ్వర్ రెడ్డి, జనగామ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పోకల లింగయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీమతి గాడిపల్లి ప్రేమలత రెడ్డి, శ్రీమతి పోకల జమున, ప్రముఖ డాక్టర్ సిహెచ్ రాజమౌళి, వైశ్య ప్రముఖులు అల్లాడి ఈశ్వరరావు, అల్లాడి ప్రభాకర్ రావు, పజ్జూరి లక్ష్మీ నరసయ్య, సీనియర్ జర్నలిస్టులు కన్న పరశు రాములు, మాదంశెట్టి శివకుమార్, బి కే కిరణ్ భాయ్ తదితరులు అనేకమంది తమ సంతాపాన్ని తెలియజేశారు.



ఆదివారం సాయంత్రం 4.30 గం. లకు అంజయ్య అంతిమ యాత్ర బయలుదేరి నెహ్రూ పార్క్ వద్ద గల లయన్స్ హిందూ స్మశాన వాటికలో అంత్య క్రియలు నిర్వహించారు.

వృత్తి గా విద్యారంగంలో, ప్రవృతిగా లయన్స్ సంస్థ వేదికగా సేవా రంగంలో విశేషరీతిలో కృషి చేసిన అంజయ్య సేవా నిరతి, కార్యదక్షతలను గుర్తు చేస్తూ విద్యా రంగ ప్రముఖులు, లయన్స్, అవొపా సంస్థల ప్రముఖులు నివాళులర్పించారు.

అంతిమ యాత్రలో పాల్గొని నివాలు లర్పించిన వారిలో కాకతీయ విశ్వ విద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వంగాల గోపాల్ రెడ్డి, పూర్వ ఆచార్యులు టి. సుధాకర్ రెడ్డి, రమణయ్య, శంకరయ్య, లయన్స్ క్లబ్ నాయకులు కుందూరు వెంకట్ రెడ్డి, డా. చంద్రశేఖర్ ఆర్య, ఎన్. సుధాకర్ రెడ్డి, పి. హరికిషన్ రెడ్డి, కె. గోవింద్ రాజ్, ఎందుకు. వెంకటేశ్వర రావు, కె. సి. జాన్ బన్నీ, ముచ్చ రాజి రెడ్డి, టి. లక్ష్మి నరసింహ రావు, డా. కె. రాజేందర్ రెడ్డి, వజ్రపు సత్యనారాయణ, డా. ఆర్. ది. చారి, ఇ. ప్రతాప్ రెడ్డి, అల్లాడి ఈశ్వర్ రావు, అల్లాడిప్రభాకర్ రావు, కుర్రేముల యాదగిరి, నాగబండి రవీందర్, డా. సి హెచ్. రాజమౌళి, చంద్రగిరి శ్రీనివాస్, ప్రసాద్, రామిని శ్రీనివాసులు, మారం లక్ష్మయ్య, చందుపట్ల రవీందర్ రెడ్డి, కలువల భాస్కర్ రెడ్డి, పజ్జూరి జయహరి, డా. కిరణ్ కుమార్, జి. ప్రమోద్ కుమార్, క్రిష్ణ జీవన్ బజాజ్, జైన రమేశ్, మహమ్మద్ అబ్దుల్ రహమాన్, మాజీద్ ఆఫ్సర్, వై. సంజీవరెడ్డి, ఉప్పలయ్య, డా. పి. నాగేశ్వర్ రావు, గాదె నర్సింహులు, జైన వెంకన్న, మర్యాల అశోక్ తదితరులు అనేకమంది ఉన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
7 ఏప్రిల్
2025





# సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం పాంబన్

**అకారణంగా ఏడుస్తుంటారు**

**కొందరికి ఇది అలవాటుగా మారింది..**

**మనమేం చేయలేం.. స్టాలిన్‌పై మోదీ విమర్శ**

**తమ హయాంలోనే తమిళనాడుకు ఎక్కువ కేటాయింపులని వెల్లడి**

**తనకు లేఖలు రాస్తున్న తమిళ నేతలు తమిళంలో సంతకం సైతం చేయడం లేదని ఎద్దేవా**

**పాంబన్ వంతెనను ప్రారంభించిన ప్రధాని.. తమిళనాడు సీఎం గైర్హాజరు**

**సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం పాంబన్**

**వందేళ్ల క్రితం గుజరాతీ బిడ్డ నిర్మించాడు**

**ఇప్పుడు మళ్లీ గుజరాత్ బిడ్డకు అవకాశం: మోదీ**



**చెన్నై, ఏప్రిల్ 6 :** తమిళనాడు అభివృద్ధికి కేంద్రం ఎంతో చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అయినా అకారణంగా ఏడవడం కొందరికి అలవాటుగా మారిందని విమర్శించారు. 'వారు ఏడుస్తూనే ఉంటారు. మనమేమీ చేయలేం' అని తమిళనాడు సీఎం స్టాలిన్ అండ్‌కోపై ధ్వజమెత్తారు. అలాగే తనకు ఎంతో మంది తమిళనాడు నేతలు లేఖలు రాస్తుంటారని.. ఒక్కరు కూడా తమిళంలో సంతకం చేయడం లేదని ఆక్షేపించారు. శ్రీలంక పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం వాయుసేనకు చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా రామనాథపురం జిల్లా మండపం వచ్చిన ప్రధాని.. పాంబన్ సముద్ర వంతెనను లాంఛనంగా ప్రారంభించారు. వంతెన పై నుంచి రైలుకు, కింది నుంచి నౌకా రవాణాకు కూడా పచ్చజెండా ఊపారు. అంతేగాక రాష్ట్రంలో రూ.8,300 కోట్ల విలువైన వివిధ రైలు, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు. తమిళనాడుకు రావలసిన నిధులను కేంద్రం నిలిపివేసిందన్న సీఎం స్టాలిన్ ఆరోపణలను మోదీ ఈ సందర్భంగా ఖండించారు. గతంతో పోలిస్తే గడిచిన పదేళ్లలో తమిళనాడుకు 3 రెట్లు అధికంగా నిధులిచ్చామన్నారు. 'గత పదేళ్లలో తమిళనాడుకు రైల్వే బడ్జెట్‌ను 7రెట్లు పెంచాం. రామేశ్వరం సహా రాష్ట్రంలో 77 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. పీఎం ఆవాస్ యోజన కింద తమిళనాడులో 12 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఈ రాష్ట్రంలో కోటికిపైగా చికిత్సలు జరిగాయి' అని తెలిపారు. హిందీ భాషను కేంద్రం తమపై రుద్దాలని చూస్తోందని ఆరోపిస్తున్న స్టాలిన్‌పై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'చాలా మంది తమిళనాడు నాయకులు నాకు లేఖలు రాస్తుంటారు. కానీ ఎవరూ తమిళంలో సంతకం చేయరు. నిజంగా వారికి తమిళ భాష అంటే అంత అభిమానముంటే మొదట తమిళంలో సంతకం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. డాక్టర్లు కావాలని కలలు కంటున్న పేద నేపథ్యం కలిగిన విద్యార్థులకు మేలు చేసేలా వైద్య విద్య కోర్సులను మాతృభాష తమిళంలో బోధించాలని స్టాలిన్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. తమిళ భాష, సంస్కృతిని ప్రపంచం నలుమూలలకూ చేర్చేందుకు కేంద్రం నిరంతరం కృషిచేస్తోందన్నారు. శ్రీరాముడి జీవితం, సుపరిపాలనా స్ఫూర్తి.. జాతి నిర్మాణానికి ముఖ్యమైన పునాదిగా పని చేస్తాయని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా పవిత్ర భూమి రామేశ్వరం నుంచి దేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

**పాంబన్‌తో ఎంతో మేలు**

'భారతరత్న' డాక్టర్ కలాం జన్మించిన భూమి రామేశ్వరమని ప్రధాని తెలిపారు. ఆయన జీవితం సైన్స్-ఆధ్యాత్మికత సమ్మిళితమని.. కొత్త పాంబన్ వంతెన కూడా సాంకేతిక-సంప్రదాయాల సమ్మేళనంగా అభివర్ణించారు. వేల సంవత్సరాల పురాతనమైన ఈ పట్టణం.. ఇప్పుడు 21వ శతాబ్దపు ఇంజనీరింగ్ అద్భుతంతో.. ప్రధాన భూభాగానికి అనుసంధానమైందన్నారు. పాంబన్ సహా దేశంలో నాలుగు దిక్కులా నిర్మించిన వంతెనలను మోదీ ప్రస్తావించారు. ఉత్తరాన జమ్మూకశ్మీర్‌లోని చీనాబ్ వంతెన ప్రపంచంలోనే ఎత్తయిన రైలు వంతెనల్లో ఒకటని.. పశ్చిమాన ముంబైలో ఇప్పుడు దేశంలోనే అతి పొడవైన సముద్రపు వంతెన అటల్ సేతు ఉందని.. తూర్పున అసోంలోని బోగిబీల్ వంతెన పురోగతికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. మత్స్యకారుల భద్రతకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని.. గత పదేళ్లలో శ్రీలంక చెర నుంచి 3,700 మందికి పైగా మత్స్యకారులను స్వదేశానికి తీసుకొచ్చామని చెప్పారు. ఇదిలా ఉండగా, శ్రీలంకలో మూడ్రోజుల పర్యటనలో చివరి రోజు ఆదివారం ప్రధాని మోదీ చారిత్రక, ఆధ్యాత్మిక నగరం అనూరాధపురకు వెళ్లారు. అక్కడ రూ.780కోట్ల భారత్ సాయంతో పునర్నిర్మించిన మహో-ఒమన్‌థాయ్ రైల్వే లైనును ప్రారంభించారు.



తర్వాత జయశ్రీ మహాబధి ఆలయాన్ని సందర్శించారు. క్రీ.పూ. 3వ శతాబ్దంలో అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర మహా థెరి నెలకొల్పిన మహాబోధి వృక్షం వద్ద ప్రార్థనలు చేశారు. మరోవైపు, మోదీ కోరిక మేరకు ఆదివారం 11 మంది తమిళ జాలర్లను శ్రీలంక విడుదల చేసింది.

**అప్పుడూ.. ఇప్పుడూ గుజరాతీ బిడ్డే**

పాంబన్‌లో వందేళ్ల క్రితం గుజరాత్‌కు చెందిన వ్యక్తి రైల్వే వంతెన నిర్మించారని, మళ్లీ శతాబ్దం తర్వాత ఇదే స్థలంలో కొత్త వంతెన నిర్మించే అదృష్టం గుజరాతీ బిడ్డ(మోదీ)కే వచ్చిందని మోదీ సభలో వ్యాఖ్యానించారు. పాంబన్ కొత్త రైలు వంతెనను ప్రారంభించి, జాతికి అంకితం చేసిన అనంతరం ప్రధాని.. తమిళ సంప్రదాయ దుస్తులైన ధోవతి, పట్టు చొక్కా, పట్టు అంగవస్త్రం ధరించి రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ఆలయానికి వెళ్లిన ఆయన మూలవిరాట్ ముంగిట నేలపై ఆశీనులై స్వామివారికి మొక్కారు. ఇదిలా ఉండగా, హెలికాప్టర్లో శ్రీలంక నుండి రామనాథపురం మండపం వచ్చేటప్పుడు 'రామసేతు'ను దర్శించుకునే అరుదైన భాగ్యం తనకు కలిగిందని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'దైవానుకూలంగా అయోధ్యలో సూర్యతిలకధారణ జరిగే సమయంలో ఈ సేతుబంధనాన్ని వీక్షించాను. ఇలా ఒకే సమయంలో రెండు దర్శనాలు శ్రీరామచంద్రుడి అనుగ్రహమే' అన్నారు.

**పార్లమెంటులో మోదీ ప్రకటన చేయాలి: స్టాలిన్**

పాంబన్ వంతెన ప్రారంభోత్సవానికి సీఎం స్టాలిన్ హాజరుకాలేదు. ముందుగా ఖరారైన కార్యక్రమాలు ఉన్నందున ప్రారంభోత్సవానికి రాలేనని ముందుగానే ప్రధానికి తెలియజేశానని ఆయన తెలిపారు. ఆదివారం ఊటీలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తమిళ గడ్డపై అడుగుపెట్టిన మోదీ.. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని పార్లమెంటులో విస్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేయాలని.. సముచిత పునర్విభజనకు ఇదొక్కటే మార్గమని.. మోదీ ఈ పనిచేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. 1971 జనాభా లెక్కల ప్రకారమే పునర్విభజన చేపడతామని 2001లో నాటి ప్రధాని వాజపేయి హామీ ఇచ్చారని.. దీనికి కేంద్రం కట్టుబడి ఉండాలని కోరారు.



# సాగునీటి సరఫరాలో సర్కార్ నిర్లక్ష్యం

## కాళేశ్వరంపై సర్కారు కక్షసాధింపు..

**విపక్షతోనే ప్రాజెక్టును ఎండబెట్టింది.. పిల్లర్ల మరమ్మతులు చేసి నీళ్లివ్వాలి**

**కేసీఆర్ సిస్టం మొత్తం రెడీ చేసి కాంగ్రెస్ సర్కారు చేతికి ఇచ్చారు**

**నేడు సరిగా వాడుకోలేకపోతున్నది, నీళ్లున్నా.. పంటలెండుతున్నయ్**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**సొంత డబ్బులతో బిక్కబండకుంటకు సాగునీటికాల్వ తవ్వకం**

**స్వయంగా నీటి విడుదల.. జిల్లా రైతాంగం హర్షం**

**చిన్నకోడూర్, ఏప్రిల్ 6:** కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై వివక్ష చూపుతున్నదని, కక్షపూరితంగానే ఈ మెగా ప్రాజెక్టును ఎండబెడుతున్నదని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారం కాల్వ నుంచి మైలారం జాలి చెరువు బికబండ కుంటకు సొంత డబ్బుతో హరీశ్‌రావు ఇటీవల కాల్వను తవ్వించారు. ఆదివారం రైతుల సమక్షంలో పైపులైన్ ద్వారా చెరువులోకి ఆయన నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షాపూరితంగానే.. కాళేశ్వరం ప్రాజెకు కింద కొత్తగా ఒక ఎకరా భూసేకరణకు నిధులు విడుదల చేయలేదని మండిపడ్డారు. ఈ వైఖరితోనే ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తున్నదని ధ్వజమెత్తారు. కాళేశ్వరం రిజర్వాయర్లలో పుష్కలంగా నీళ్లున్నా నీటి విడుదలలో నిర్లక్ష్యం చూపుతుందని మండిపడ్డారు. ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడంతో రైతులే సొంతంగా కాల్వలు తవ్వుకునే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఉద్దేశపూర్వకంగా కాళేశ్వరం ప్రాజెక్టు కింద కాల్వల నిర్మాణం, నీటి పంపింగ్ చేయడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, రంగనాయక సాగర్, కొండపోచమ్మ, మిడ్ మానేరులో నీళ్లున్నా.. కుట్రతోనే విడుదల చేయడం లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ నాడు కాళేశ్వరం మెగా ప్రాజెక్టును నిర్మించి, సిస్టం అంతా రెడీ చేసినట్టు తెలిపారు. కేవలం భూసేకరణ చేసి కాల్వలు తవ్వి రైతులకు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా, అది మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం లేదని మండిపడ్డారు.

మైలారం జాలిచెరువు, కొండెంగులకుంట, బికబండ పరిధిలో నీళ్లులేక పంటలు ఎండుతున్నాయని ఇటీవల తనతో రైతులు మొరపెట్టుకున్నారని, పంటలు ఎండిపోవద్దని ఉద్దేశంతో తన సొంత డబ్బుతో కాల్వ పనులు చేయించినట్టు తెలిపారు. కండ్ల ముందు పంటలు ఎండుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. ఎలాంటి జాప్యం చేయకుండా కుంగిన ఒకటో, రెండో పిల్లర్లను మరమ్మతులు చేసి కాళేశ్వరం నీళ్లిచ్చి పంటలు కాపాడాలని హరీశ్‌రావు కోరారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, పరకాల మల్లేశంగౌడ్, సత్యనారాయణరెడ్డి, మేడికాయల వెంకటేశం, పోచబోయిన శ్రీహరియాదవ్, పెట్టబోయిన శ్రీనివాస్, కాల్వ ఎల్లయ్య, ఏంరెడ్డి భూమిరెడ్డి, జంగిటి శ్రీనివాస్, కొండం రవీందర్‌రెడ్డి, ముకెర శ్రీనివాస్, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

**పదేండ్ల ప్రగతిని ఏడాదిలో దెబ్బతీశారు**

బీఆర్ఎస్ పాలనలోని పదేండ్ల ప్రగతిని నేడు కాంగ్రెస్ సర్కారు ఏడాదిలోనే దెబ్బతీసిందని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. 2024-25లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయంలో తగ్గుదలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వం అనాలోచిత విధానాలతో రాష్ట్రం అధోగతి పాలవుతున్నదని మండిపడ్డారు. ఉ బీఆర్ఎస్ హయాంలో కొవిడ్ కాలం మినహా రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక వృద్ధిరేటు 25.62 శాతం ఉండేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 1.93 శాతం తగ్గిందని తెలిపారు. హైదరాబాద్ ప్రతిష్ఠను దెబ్బతీయడంతోనే ఆదాయంలో తగ్గుదల నమోదైందని తెలిపారు. నాడు వేగంగా ఎదిగిన తెలంగాణ.. కాంగ్రెస్ సర్కార్ తొందరపాటు నిర్ణయాలతో నేడు వెనుకబాటుకు గురయ్యే పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు.

# నేడు, రేపు అక్కడక్కడ వానలు



**హైదరాబాద్, విశాఖపట్నం, ఏప్రిల్ 6 :** రాష్ట్రంలో రెండు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం తెలిపింది. సోమ, మంగళవారాల్లో పలుజిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మంగళవారం ఖమ్మం, భద్రాద్రి, సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ, హనుమకొండ, సూర్యాపేట జిల్లాల్లో వానలు పడే అవకాశముందని పేర్కొంది. ఈ రెండు రోజులు అన్ని జిల్లాల్లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల్లోపే నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తర్వాత మరింత బలపడి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని అంచనా వేసింది.

# అప్పు తీర్చమన్నందుకు ఫైనాన్సర్ దారుణ హత్య

**సికింద్రాబాద్‌లోని గాంధీనగర్‌లో ఘటన**

**పరారీలో నిందితుడు**

**రాంనగర్, ఏప్రిల్ 6 :** ఇచ్చిన అప్పును తీర్చమన్న పాపానికి ఓ ఫైనాన్సర్‌ను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసి తన ఇంట్లోని సంపులో పడేసి పారిపోయాడో వ్యక్తి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని గాంధీనగర్‌లో జరిగింది. అల్వాల్ వెంకటాపురానికి చెందిన స్వప్నం సింగ్ (59) వృత్తి రీత్యా ఫైనాన్సర్, పరిచయం ఉన్న వారందరికీ ఆయన ఫైనాన్స్ ఇస్తుంటారు. ఈ క్రమంలో గాంధీనగర్‌లో చాయి బండి నిర్వహించే ఒడిసాకు చెందిన నవీన్‌కు ఆయన ఫైనాన్స్ ఇచ్చారు. అయితే నవీన్ తీసుకున్న అప్పును తీర్చకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన స్వప్నం సింగ్ డబ్బు అడిగేందుకు నవీన్ ఇంటికి వెళ్లారు. ఆ రోజు ఇంట్లోనే ఉన్న నవీన్‌ను అప్పు తీర్చాలని స్వప్నం సింగ్ నిలదీసి అడగగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో కోపోద్రిక్తుడైన నవీన్, స్వప్నం సింగ్‌పై కత్తితో పలుమార్లు దాడి చేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని తన ఇంట్లోని నీటి సంపులో పడేసి పరారయ్యాడు. స్వప్నంసింగ్ ఇంటికి రాకపోవడంతో భయపడిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్ ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా స్వప్నం సింగ్.. నవీన్ ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించి అక్కడకు వెళ్లి చూడగా సంపులో ఆయన మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు నవీన్‌ను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు చెప్పారు. కాగా, నిందితుడు నవీన్.. స్వప్నం సింగ్ దగ్గరే కాకుండా పలువురి దగ్గర అప్పులు చేసి బోయిగూడలో ఓ ఇల్లు కొన్నట్లు తెలిసింది.

# వాస్తవాలను ఏఐతో ముడిపెడ్తరా?

**రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేలా సీఎం రేవంత్ తీరు**

**ఇప్పటికైనా తెలివి తక్కువ పనులు మానుకోవాలి**

**మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్**




**సూర్యాపేట, ఏప్రిల్ 6 :** కంచె గచ్చిబౌలి వాస్తవాలను ఏఐకు ముడిపెట్టడం హాస్యాస్పదమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. హెచ్‌సీయూలో నెమళ్ల అరుపులు, పోలీసుల లాఠీచార్జిలు, జింకల చావులు, బుల్డోజర్లు కూడా ఏఐ సృష్టేనా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన రివ్యూపై ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రేవంత్ తీరు రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా ఉందని విమర్శించారు. సీఎం స్థాయిలో జరగాల్సిన రివ్యూలా లేదని పేర్కొన్నారు. సీఎం తీరును చూసి సామాన్య ప్రజలు సైతం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారులు, అనుచరులు ఇస్తున్న సలహాలపై పునరాలోచన చేసి మాట్లాడితే మంచిదని హితవు పలికారు. సుప్రీం కోర్టు ఆదేశాలను ధిక్కరించడం రేవంత్ పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అసలు ఏఐ కంచె గచ్చిబౌలిలో పుట్టిందా, అక్కడ ఊరకుక్కలు, జింకలను చంపింది ఏఐ సృష్టేనా అని నిలదీశారు. లేనివి సృష్టించడం, తప్పుడు ప్రచారాలు చేయడం రేవంత్‌కే అలవాటని చెప్పారు. ఈ విషయంలో కోర్టుకు పోతామంటే వాళ్లకు చీవాట్లు తప్పవని తెలిపారు. సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్నప్పుడే వాళ్ల ఆలోచన మార్చుకోవాల్సిందని హితవు పలికారు. యూనివర్సిటీనే మార్చుతామన్న రేవంత్ లీకులు అనాలోచితమేనని, అసలు కొత్తగా యూనివర్సిటీ అనుకుంటున్న దగ్గరే 400 ఎకరాలు కూడా ఇచ్చుకోవచ్చు కదా అని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలను తక్కువ అంచనా వేయడం సరికాదని, రేవంత్ ఇప్పటికైనా తెలివి తక్కువ పనులు మాని అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిందని హితవుపలికారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
7 ఏప్రిల్
2025





# సీపీఎం కొత్త సారథి ఎంఏ బేబీ

**మదురైలో జరిగిన పార్టీ మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక**

**తొలిసారిగా మైనారిటీ నేతకు పగ్గాలు**

**సంఘ్‌ను ఎదుర్కోవడమే లక్ష్యమన్న బేబీ**

**పొలిట్ బ్యూరోలో బీవీ రాఘవులు, అరుణ్‌కుమార్‌లకు చోటు**

**ప్రకాశ్ కరత్, బృందా కరత్‌కు ఉద్వాసన**

**సీసీలో మరో 9 మంది తెలుగువారు**



**చెన్నై, హైదరాబాద్, ఏప్రిల్ 6:** కేరళకు చెందిన సీనియర్ నేత మరియం అలెగ్జాండర్ బేబీ (ఎంఏ బేబీ) సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తమిళనాడులోని మదురైలో జరిగిన పార్టీ కాంగ్రెస్ సమావేశంలో ప్రధాన కార్యదర్శితోపాటు 84 మంది సభ్యుల కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడంతో ఆ పదవి ఖాళీ అయింది. దీనితో మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ తాత్కాలిక కోఆర్డినేటర్‌గా ఆ బాధ్యతలను నిర్వర్తించారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నారు. క్రిస్టియన్ అయిన ఎంఏ బేబీ సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి మైనార్టీ నేత కావడం విశేషం. వామపక్ష రాజకీయాలకు కేంద్రమైన కేరళ నుంచి ఈఎంఎస్ నంబూద్రిపాద్ తర్వాత ఈ పదవికి ఎన్నికైన రెండో నేత ఎంఏ బేబీ. ఎంఏ బేబీ 1954లో కేరళలోని ప్రాక్కులంలో జన్మించారు. అక్కడే పాఠశాల విద్య పూర్తి చేశారు. అప్పుడే ఆయన ఎస్ఎఫ్ఐకి పూర్వరూపమైన కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చేరి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. కొల్లాంలోని ఎస్ఎన్ కాలేజీలో డిగ్రీలో చేరినా పూర్తి చేయలేదు. తర్వాత ఎస్ఎఫ్ఐకి, సీపీఎం యూత్ విభాగం 'డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ)'కి అధ్యక్షుడిగా పనిచేశారు. ఎమర్జెన్సీ సమయంలో కొంతకాలం జైలు జీవితం అనుభవించారు. 1986లో కేవలం 32 ఏళ్ల వయసులోనే రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1999లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా నియామితులయ్యారు. 2006, 2011లో కేరళలోని కుందర ఎమ్మెల్యేగా గెలిచారు.

2006 నుంచి 2011 వరకు రాష్ట్ర విద్యా మంత్రిగా పనిచేశారు. 71 ఏళ్ల ఎంఏ బేబీకి కరుడుగట్టిన నాస్తికుడిగా పేరుంది. కేరళ విద్యా మంత్రిగా పనిచేసిన సమయంలో ఆయన తెచ్చిన పలు సంస్కరణలు, నాస్తికత్వాన్ని బోధించే పాఠ్యాంశాలను స్కూల్ సిలబ స్‌లో ప్రవేశపెట్టడం వంటివి వివాదాస్పదం అయ్యాయి. కాగా, బలహీనంగా ఉన్న చోట సీపీఎంను బలోపేతం చేయడం, బీజేపీ ఆధ్వర్యంలోని సంఘ్ పరివార్‌ను ఎదుర్కోవడమే తన ముందున్న ప్రధాన లక్ష్యాలని ఎంఏ బేబీ తెలిపారు. పార్టీ నేతలంతా ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్టు తెలిపారు.

**సీనియర్లకు ఉద్వాసన!**

మదురైలో 3రోజులుగా జరుగుతున్న సీపీఎం 24వ పార్టీ కాంగ్రెస్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శితోపాటు కొత్తగా కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులను ఎన్నుకున్నారు. పార్టీలో అత్యున్నత నిర్ణాయక విభాగమైన పొలిట్ బ్యూరోలోకి కొత్తగా ఎనిమిది మందికి అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో సీనియర్లు ప్రకాశ్ కరత్, బృందా కరత్, మాణిక్ సర్కార్ తదితర సీనియర్లకు పొలిట్ బ్యూరో నుంచి ఉద్వాసన పలికి.. కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశమిచ్చారు. మొత్తంగా కేంద్ర కమిటీలో 20్న మంది మహిళలు ఉన్నారని సీపీఎం ప్రకటించింది.

**తెలుగు రాష్ట్రాలకు చెందిన 11 మందికి చాన్స్**

తెలుగు రాష్ట్రాల నుంచి బీవీ రాఘవులు, ఆర్.అరుణ్‌కుమార్‌లకు పొలిట్ బ్యూరోలో.. తెలంగాణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శులు జాన్ వెస్లీ, వి.శ్రీనివాసరావులతోపాటు తమ్మినేని వీరభద్రం, ఎస్.వీరయ్య, జ్యోతి, పుణ్యవతి, సాయిబాబు, రమాదేవి, లోకనాథంలకు కేంద్ర కమిటీలో చోటు దక్కింది. ఇందులో ఆర్.అరుణ్‌కుమార్‌తోపాటు పుణ్యవతి, సాయిబాబులకు ఢిల్లీ కోటాలో కేంద్ర కమిటీలో చోటు కల్పించినట్టు సమాచారం. వీరిలో రాఘవులు, శ్రీనివాసరావు, వీరభద్రం, పుణ్యవతి ఇప్పటికే కేంద్ర కమిటీలో ఉండగా.. మిగతావారికి కొత్తగా చోటు కల్పించారు.

# 6 రోజుల్లో 1.27 కోట్ల మందికి సన్నబియ్యం

**8.75 లక్షల క్వింటాళ్ల బియ్యం పంపిణీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 6 :** రాష్ట్రంలో గడిచిన ఆరు రోజుల్లో 1.27 కోట్ల మంది లబ్ధిదారులు సన్నబియ్యం తీసుకున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 90.42 లక్షల రేషన్ కార్డులుండగా.. ఇప్పటివరకు ఏప్రిల్ కోటా కింద 42 లక్షల రేషన్ కార్డులపై పేదలు బియ్యం తీసుకున్నారు. ప్రతి నెలా లబ్ధిదారులు సగటున 16 లక్షల క్వింటా ళ్ల బియ్యం రేషన్ షాపులనుంచి తీసుకుంటుండగా... ఈ నెలలో ఆరు రోజుల వ్యవధిలో 8.75 లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని వినియోగదారులకు పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,311 రేషన్ షాపులుండగా.. 8,899 షాపుల్లో సన్నబియ్యం పంపిణీ జరుగుతోంది. కొన్ని జిల్లాలకు బియ్యం రవాణా పూర్తిస్థాయిలో జరగకపోవటం, కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు వస్తుండటం, మరికొన్నిచోట్ల ప్రజాప్రతినిధుల రాక కోసం ఎదురుచూస్తుండటంతో.. బియ్యం పంపిణీ మందకొడిగా సాగుతోంది. గోదాము ల నుంచి రేషన్‌షాపులకు బియ్యం రవాణా దాదాపుగా పూర్తయిందని, ఈ వారంలో బియ్యం సరఫరా మరింత మెరుగుపడుతుందని, 15 తేదీ నాటికి పూర్తవుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ప్రసాద్ తెలిపారు.

# కన్నుల పండువగా శోభాయాత్ర భారీగా తరలివచ్చిన భక్తులు

**అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 6 :** శ్రీరామ నవమి సందర్భంగా హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి కోఠి హనుమాన్ వ్యాయామ్‌శాల వరకు నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. తొలుత భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సీతారాంబాగ్ ఆలయం వద్ద సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాత్రను ప్రారంభించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ధూల్‌పేట ఆకాశపురి హనుమాన్ దేవాలయం వద్ద హనుమాన్ చాలీసా పఠనం చేసి శోభాయాత్రను ప్రారంభించారు.

ధూల్‌పేట నుంచిఆనంద్ సింగ్ ఏర్పాటు చేసిన సీతారాముల పల్లకి యాత్రను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. ప్రధాని మోదీ నిజమైన భూములకు రక్షణ కల్పించడం కోసమే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకొచ్చారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పారు. దేశం మొత్తం మోదీ, యోగీ వైపు చూస్తోందన్నారు. రామ మందిర నిర్మాణం జరగదని ఒవైసీ భావించారని కానీ మోదీ ప్రభుత్వం రామమందిర నిర్మాణం చేసి చూపిందని రాజా సింగ్ చెప్పారు. శోభాయాత్ర శాంతియుతంగా సాగేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.



# భూముల వేలాన్ని విరమించుకోవాలి

**కంచె గచ్చిబౌలిని శాశ్వతంగా కాపాడుకుందాం**

**విద్యార్థులు, పర్యావరణవేత్తలకు కేటీఆర్ లేఖ**



**హైదరాబాద్, ఏప్రిల్ 6 :** రాష్ట్ర ప్రభుత్వం ఒక రియల్‌ఎస్టేట్ దళారి మాదిరిగా ఆర్థిక ప్రయోజనాల గురించి ఆలోచించకుండా, భవిష్యత్ ప్రయోజనాల కోసం కంచె గచ్చిబౌలి భూముల వేలాన్ని పూర్తిగా విరమించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు 400 ఎకరాల భూమిని కాపాడేందుకు నిస్వార్థంగా చేపట్టిన ఆందోళన అద్భుతమని పేర్కొన్నారు. ఈ భూములను శాశ్వతంగా కాపాడుకునేందుకు ఐక్యపోరాటం చేద్దామని విద్యార్థులు, పర్యావరణవేత్తలను ఆదివారం బహిరంగ లేఖ ద్వారా ఆయన కోరారు.

50 ఏళ్లకుపైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు, విజ్ఞానానికి కేంద్రంగా నిలిచిందని, కాంగ్రెస్ చెబుతున్న ఏకోపార్క్ కన్నాగొప్పగా పర్యావరణ సమతుల్యత కలిగిందిగా ఈ క్యాంపస్ నిలిచిందని తెలిపారు. ప్రకృతికి విఘాతంకలగకుండా, యూనివర్సిటీకి ప్రమాదం రాకుండా తమ పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. భూములను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం సాగిద్దామని, దీనికి విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రముఖులు, తెలంగాణ ప్రజలు కలిసి రావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# గురుకులంలో భట్టి ఆకస్మిక తనిఖీ

**విద్యార్థినులతో కలిసి భోజనం**



**వైరా, ఏప్రిల్ 6 :** ఖమ్మం జిల్లా వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆదివారం రాత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ముందుగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమైన భట్టి విక్రమార్క అక్కడ వసతులు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సమయంలో "డిన్నర్ రెడీగా ఉందా? అంతా కలిసి భోజనం చేద్దాం పదండి" అంటూ పిల్లలను వెంట పెట్టుకొని ఎమ్మెల్యే రాందాసనాయక్‌తో కలిసి డైనింగ్ హాల్‌కు వెళ్లారు. ఆ తర్వాత విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ పాటిస్తున్నారా.. భోజనాల్లో నాణ్యత ఎలా ఉంటుంది? అంటూ విద్యార్థినులను ప్రశ్నించారు. దాంతో భోజనం నాణ్యత బాగుంటుందని, మెనూ పాటిస్తున్నారని విద్యార్థినులు సమాధానమిచ్చారు.

# బీఆర్ఎస్‌తో ఒప్పందం మేరకే ఎమ్మెల్సీ బరిలో బీజేపీ: పొన్నం




**హైదరాబాద్, ఏప్రిల్ 6 :** బీఆర్ఎస్‌తో ఒప్పందంలో భాగంగానే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లేదంటే బలమే లేని చోట బీజేపీ ఎలా బరిలో నిలుస్తుందని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. 'హైదరాబాద్ స్థానిక సంస్థలకు ఉన్న మొత్తం 112 ఓట్లలో బీజేపీకి 27 ఓట్లే ఉన్నాయి. ఎంఐఎంకు 49, బీఆర్ఎసకు 23, కాంగ్రెసకి 13 ఓట్లున్నాయి. గెలిచే బలం లేదని కాంగ్రెస్ పోటీ చేయకుండా తటస్థంగా ఉంది. బీఆర్ఎస్ కూడా పోటీలో లేదు. అలాంటప్పుడు 27 ఓట్లతో బీజేపీ గెలుపెలా సాధ్యం? బీజేపీ అభ్యర్థికి బీఆర్ఎస్ ఓట్లు వేస్తుందా? ఈ మేరకు రాజకీయ అవగాహన చేసుకున్నారా?' అని నిలదీశారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్.. బీజేపీకి లోపాయికారిగా సహకరించిందని ఆయన అన్నారు.

# ఆహార కల్తీలో దక్షిణాదిలో తెలంగాణకు రెండో స్థానం

**నాలుగేళ్లలో సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 14 శాతం కల్తీ**

**58 శాతంతో దేశంలోనే యూపీ టాప్**

**కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 6 :** దేశంలో ఆహార కల్తీ రోజురోజుకి పెరిగిపోతూ ఆందోళన కలిగిస్తోంది. ఆహార భద్రత అధికారులు గత నాలుగేళ్లలో దేశ వ్యాప్తంగా సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 22 శాతం కల్తీవే ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించిన లెక్కలు భయపెడుతున్నాయి. 2021-24 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా సేకరించిన ఆహార పదార్థాల నమూనాలు, అందులో కల్తీగా తేలిన నమూనాల లెక్కలను రాష్ట్రాల వారీగా ఆ శాఖ ఇటీవల పార్లమెంట్‌కు నివేదించింది. దీని ప్రకారం.. ఆహార కల్తీలో తెలంగాణ దక్షిణాది రాష్ట్రాల్లో రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణలో గత నాలుగేళ్ల సగటు 14 శాతంగా ఉంది. అంటే తెలంగాణలో సేకరించి పరీక్షించిన ప్రతీ 100 నమూనాల్లో 14 వరకు కల్తీ ఆహారంగా తేలుతున్నాయి. ఇక, ఆహార కల్తీలో తమిళనాడు 20 శాతం సగటుతో దక్షిణాది రాష్ట్రాల్లోనే అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ రెండో స్థానంలో ఉండగా.. కేరళలో 13.11 శాతం, ఆంధ్రప్రదేశ్ 9 శాతం, కర్ణాటక 6.30 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

**వామ్మో.!! యూపీ**

ఆహార కల్తీలో ఉత్తరప్రదేశ్(యూపీ) దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. యూపీలో గత నాలుగేళ్లల్లో 93,182 ఆహార నమూనాలు సేకరించగా, అందులో 54,474 నమూనాల(58.75 శాతం)లో కల్తీని గుర్తించారు. యూపీ తర్వాత ఝార□ండ్ 49.91 శాతం, హరియాణా 27.48 శాతం, రాజస్థాన్ 26.28 శాతం సగటుతో ఆహారకల్తీలో వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గత నాలుగేళ్ల జాతీయ సగటు 22 కంటే ఈ రాష్ట్రాల్లో చాలా ఎక్కువగానే ఆహార పదార్థాల కల్తీ ఉండడం గమనార్హం. కాగా కలుషితమైన తాగునీరు, ఆహార పదార్థాల వల్ల మనుషులు 200 రకాలకు పైగా వ్యాధులు బారినపడే అవకాశం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
7 ఏప్రిల్
2025






# పర్సనల్ లోన్.. తనఖా రుణం ఏది బెటర్!

వ్యక్తిగత రుణానికి తాకట్టు అవసరం లేదు. రుణమూ త్వరగానే లభిస్తుంది. కానీ, వడ్డీయే కాస్త ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. తనఖా రుణాలపై వడ్డీ తక్కువ. పెద్ద మొత్తంలో రుణం తీసుకోవచ్చు. కాకపోతే, ఏదైనా ఆస్తి తాకట్టు పెట్టాల్సిందే. పైగా ప్రహసనంతో కూడిన ప్రక్రియ. మరి ఏది సరైనది..? అంటే, మీ అవసరం, పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత రుణం తీసుకోవాలా..? తనఖా రుణం కోసం ప్రయత్నించాలా..? అనే సందిగ్ధ స్థితిలో ఉన్నవారు సరైన ఎంపిక చేసుకోవడానికి పరిగణనలోకి తీసుకో వాల్సిన అంశాల గురించి తెలుసుకుందాం..

వ్యక్తిగత రుణాలతో పాటు తనఖా రుణాలకూ కొన్ని అనుకూలతలు, మరికొన్ని ప్రతికూలతలూ ఉన్నాయి. దేనికదే ప్రత్యేకం కూడా. ఈ రెండింటి ప్రత్యేకతలను స్పష్టంగా అర్థం చేసుకోగలిగితే, ఎంపిక సులభమవుతుంది. అలాగే, మీ ఆర్థిక అవసరాన్ని, క్రెడిట్ స్కోర్‌ను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.



### వ్యక్తిగత రుణం

ఇది తనఖారహిత రుణం. అంటే, ఈ రుణం కోసం ఏమీ తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. ఈ రుణాలను మీ క్రెడిట్ స్కోర్, హిస్టరీ ఆధారంగా మంజూరు చేస్తారు. ఇందులో రుణదాతకు రిస్క్ ఎక్కువ. అందుకే, అధిక వడ్డీ వసూలు చేస్తారు. తాకట్టు అవసరం అవసరం లేకపోవడం, త్వరితగతిన రుణ మంజూరు, తీసుకున్న సొమ్మును ఏ అవసరానికైనా ఉపయోగించుకోగలిగే వెసులుబాటు ఈ రుణ అనుకూలతలు. మిగతా రుణాలతో పోలిస్తే అధిక వడ్డీ చెల్లించాల్సి రావడం ప్రతికూలమే. మీ ఆదాయం, పరపతి స్థాయి, క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే మీకు ఎంత రుణం మంజూరు చేయవచ్చనే అంశాన్ని రుణదాత నిర్ణయిస్తారు. ఆదాయం తక్కువగా ఉంటే మీరు ఆశించినంత రుణం లభించకపోవచ్చు. క్రెడిట్ స్కోర్ అంత బాగా లేని పక్షంలోనూ అధిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పైగా, రుణ మొత్తంలోనూ రాజీ పడాల్సిందే.

### తనఖా రుణం

ఇది తాకట్టుపై లభించే రుణం. ఇందుకోసం రుణగ్రహీత తనకు చెందిన ఏ ఆస్తినైనా తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. సాధారణంగా ఏదైనా స్థిరాస్తి కొనుగోలుకు లేదా ప్రస్తుత ప్రాపర్టీని తాకట్టు పెట్టి నిధులు సమీకరించేందుకు ఈ రుణాన్ని ఎంచుకుంటారు. దీని సానుకూలత విషయానికొస్తే, ఇందులో రుణదాతకు నష్ట భయం తక్కువ. కాబట్టి వ్యక్తిగత రుణంతో పోలిస్తే కాస్త తక్కువ వడ్డీకే లభిస్తుంది. ఆస్తి విలువ ఆధారంగా రుణమిస్తారు కాబట్టి, అధిక మొత్తంలో సొమ్ము లభించే అవకాశం ఉంటుంది. పైగా, తనఖా రుణాల తిరిగి చెల్లింపులకూ చాలా సంవత్సరాలు సమయం లభిస్తుంది. తద్వారా తక్కువ మొత్తంలో నెలవారీ కిస్తీ (ఈఎంఐ)ల్లో సుదీర్ఘకాలం పాటు తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ప్రతికూలతల గురించి ప్రస్తావించాలంటే, రుణం కావాలంటే ఏదైనా ఆస్తిని తప్పనిసరిగా తాకట్టు పెట్టాల్సిందే. ఒకవేళ రుణాన్ని తిరిగి చెల్లించలేని పక్షంలో రుణదాత మీ ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ రుణ దరఖాస్తు ప్రాసెసింగ్, మంజూరుకూ కొంత సమయం పడుతుంది. ప్రాసెసింగ్ చార్జీలూ అధికమే. ఇందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ కూడా ప్రహసనంతో కూడిన ప్రక్రియ.


### ఎంపిక ఎలా..?

ఉద్దేశం: ప్రాపర్టీ కొనుగోలుకైతే తనఖా రుణం మేలు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి లేదా ఏదైనా ఆర్థిక అత్యయిక పరిస్థితుల నుంచి బయటపడేందుకైతే వ్యక్తిగత రుణం మెరుగైన ప్రత్యామ్నాయం.

సమయం: తక్షణమే నిధులు కావాలంటే వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం మంచిది. కాస్త సమయం పట్టినా ఫర్వాలేదు, పెద్ద మొత్తంలో నిధులు కావాలంటే తనఖా రుణం కోసం ప్రయత్నించవచ్చు.

వడ్డీ రేటు: తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు అధిక వడ్డీ అయినా ఫర్వాలేదనుకుంటే వ్యక్తిగత రుణం తీసుకోవచ్చు. తక్కువ వడ్డీయే మీ ప్రాధాన్యమైతే, తక్షణ అవసరం కాని పక్షంలో తనఖా రుణాన్ని ఎంచుకోండి.

క్రెడిట్ స్కోర్: ఈ రెండింటిలో మీ అవసరానికి సరిపోయే రుణాన్ని ఎంచుకోవడంలో క్రెడిట్ స్కోర్, హిస్టరీ చాలా కీలకం. ఎందుకంటే, రుణం ఇవ్వాలా..? వద్దా..? అనే విషయంలో క్రెడిట్ స్కోరే మీ అర్హతను నిర్ణయిస్తుంది. అంతేకాదు, మీ క్రెడిట్ స్కోర్ ఆధారంగానే రుణ దాత ఎంత వడ్డీ వసూలు చేయాలనే విషయాన్ని నిర్ణయిస్తాడు. కాబట్టి, తీసుకున్న రుణాలను సక్రమంగా, సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా క్రెడిట్ స్కోర్‌ను మరింత పెంచుకోవచ్చు. తద్వారా భవిష్యత్‌లో తక్కువ వడ్డీకి రుణాలు పొందే అవకాశముంటుంది.



# ఈ వారం మార్కెట్లు దబిడి దిబిడేనా?

భారత స్టాక్ మార్కెట్లు రేపటి వారం అత్యంత ఒడిదుడుకులతో ఉండే అవకాశం కనిపిస్తోంది. అమెరికా తెచ్చిన పూర్తి స్థాయి వాణిజ్య యుద్ధం.. ప్రపంచ వాణిజ్యాన్ని, తద్వారా ఆయా దేశాల ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తుందని, దీనికి తోడు అమెరికా ఆర్థిక మాంద్య భయాలతో పెట్టుబడిదారులు భయపడుతున్నారని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇదిలా ఉంటే, వచ్చే వారం RBI వడ్డీ రేటు నిర్ణయం వెలువడుతుండటం, ఈ వారంలో భారతదేశ పారిశ్రామిక, ఉత్పత్తి డేటా కూడా విడుదల కానుంది. అటు, అమెరికా ద్రవ్యోల్బణ డేటా వస్తుండటం వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిర పోకడలను ఎదుర్కోవచ్చని ట్రేడ్ పండితులు లెక్కలు కడుతున్నారు. అమెరికా సుంకాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణంపై విస్తృత ప్రభావాలను పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు, చైనా యొక్క మార్చి నెల కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (CPI) డేటా గురువారం విడుదల కానుంది. యూకే GDP డేటా శుక్రవారం విడుదల కానుంది. ఇక, ఏప్రిల్ 10న TCS ఫలితాలతో Q4 FY25 ఇన్ కం సీజన్ ప్రారంభమవుతుంది. ఈ వారం అమెరికా, భారతదేశం నుండి వెలువడే మార్చి CPI డేటాపై కూడా పెట్టుబడిదారులు దృష్టి సారిస్తారని చెబుతున్నారు. దీనికి తోడు ఈ వారం విదేశీ పెట్టుబడిదారుల వాణిజ్య కార్యకలాపాలు, రూపాయి-డాలర్ ధోరణి, క్రూడ్ ఆయిల్ ధరలను మార్కెట్లు ఆసక్తిగా పరిశీలిస్తాయని నిపుణులు తెలిపారు. ఈక్విటీ బెంచ్ మార్క్‌లు శుక్రవారం సర్వత్రా అమ్మకాల కారణంగా క్షీణించిన సంగతి తెలిసిందే. ఇక, వచ్చే వారం భారత మార్కెట్లు 4రోజులే పనిచేస్తాయి. ఈక్విటీ మార్కెట్లు గురువారం "శ్రీ మహావీర్ జయంతి" పండుగ సందర్భంగా సెలవు.

# ఆరోగ్య బీమాపై ట్యాక్స్ రిబేటు



ఆరోగ్య బీమా ఉంటే.. అత్యవసర సమయాల్లో దవాఖాన ఖర్చులు, వైద్య చికిత్స వ్యయాల నుంచి గొప్ప రక్షణను పొందవచ్చు. అయితే ఈ బీమా ఖరీదెక్కడంతో చాలామందికి ప్రీమియంలు భారంగా మారుతున్నాయి. దీంతో సమగ్ర ఆరోగ్య బీమా అందరికీ దక్కని పరిస్థితులు నెలకొంటున్నాయి. దీన్ని అధిగమించేలా ఆరోగ్య బీమా ప్రీమియంలపై పన్ను మినహాయింపులను కల్పించారు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టం (1961)లోని సెక్షన్ 80డీ కింద పాలసీదారులు ప్రతీ ఆర్థిక సంవత్సరంలో తమ ఆరోగ్య బీమాకు చెల్లించే ప్రీమియంలపై ట్యాక్స్ రిబేటును కోరవచ్చు. ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఈ సదుపాయాన్ని ట్యాక్స్‌పేయర్స్ ఉపయోగించుకోవచ్చు. పాలసీదారులు అందరూ 60 ఏండ్లలోపుంటే వ్యక్తిగత, కుటుంబ బీమా ప్రీమియంలపై ట్యాక్స్‌పేయర్లు ఏటా రూ.25వేలదాకా పన్ను మినహాయింపును అందుకోవచ్చు.

తల్లిదండ్రుల వయసు 60 ఏండ్లలోపే ఉంటే వారి కోసం ట్యాక్స్‌పేయర్ తీసుకునే బీమాపై మరో రూ.25వేలదాకా పన్ను ప్రయోజనం పొందవచ్చు. 60 ఏండ్లు దాటితే ట్యాక్స్ రిబేటు రూ.50వేలదాకా వస్తుంది.

పాలసీదారులు అందరూ 60 ఏండ్లపైనే ఉంటే లక్ష రూపాయలదాకా పన్ను మినహాయింపు కోరవచ్చు.

వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలకే సెక్షన్ 80డీ కింద ఈ ప్రయోజనాలుంటాయి. కంపెనీలిచ్చే గ్రూప్ ఇన్సూరెన్స్‌లకు వర్తించవు.

హిందూ అవిభాజ్య కుటుంబాల్లో పాలసీదారులు అందరూ 60 ఏండ్లలోపే ఉంటే రూ.25,000, ఒక్కరి వయసు 60 ఏండ్లు దాటినా రూ.50,000 పన్ను ప్రయోజనం దక్కుతుంది.

నగదు రూపంలో ఆరోగ్య బీమా ప్రీమియంలు చెల్లిస్తే పన్ను మినహాయింపులను కోరలేము.

# టారిఫ్‌లు, ఆర్బీఐ సమీక్షపైనే దృష్టి





దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలతో ఉలిక్కిపడ్డాయి. వరుస నష్టాల నుంచి సూచీలు కోలుకుంటున్న తరుణంలో టారిఫ్‌ల పిడుగు వచ్చిపడింది. ప్రపంచవ్యాప్తంగా ఇది వాణిజ్య యుద్ధానికి దారితీయగా.. మదుపరుల భయాల నడుమ ఈక్విటీ మార్కెట్లు అంతటా కుప్పకూలిపోయాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,050.23 పాయింట్లు లేదా 2.64 శాతం పతనమై 75,364.69 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 614.80 పాయింట్లు లేదా 2.61 శాతం క్షీణించి 22,904.45 దగ్గర స్థిరపడింది.

ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడ్ వార్ భయాలు మార్కెట్లను వెంటాడుతాయని, ఆయా దేశాలు అమెరికా టారిఫ్‌లపై స్పందించే తీరే కీలకమని మెజారిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే చైనా దీటుగా స్పందించింది. తమ దేశంలోకి వచ్చే అమెరికా వస్తూత్పత్తులపై 34 శాతం అదనపు సుంకాలుంటాయని ప్రకటించింది. ఈ క్రమంలో మరికొన్ని దేశాలూ ఇదే దిశగా వెళ్తుండగా, ఇంకొన్ని దేశాలు అమెరికాతో చర్చలకు ప్రయత్నిస్తున్నాయి. ఇక ఈ విషయంలో భారత్ ప్రతిస్పందన కూడా స్టాక్ మార్కెట్లకు దిశా-నిర్దేశం చేయగలదు. ఇదిలావుంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష కూడా కీలకమే.

ఈ నెల 9న ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయాలుంటాయి. గత సమీక్షలో చాలాకాలం తర్వాత రెపోరేటును పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి కూడా వడ్డీరేట్ల కోత ఉంటుందన్న అంచనాలే నెలకొన్నాయి. ఇదే జరిగితే ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్లకు కొత్త ఉత్సాహం లభించినట్టే అనుకోవచ్చు. అలాకాకపోతే మాత్రం సూచీలు మరింత దిగజారే అవకాశాలే ఎక్కువ. మదుపరులపై అమ్మకాల ఒత్తిడి కొనసాగవచ్చు మరి.

ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,600 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,400 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,200-23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




# ఎస్బీఐ అమృత్ వృష్టి..

## ఆకర్షణీయ వడ్డీతో ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఈ నెల 1 నుంచి తమ పాపులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకం అమృత్ కలశ్‌ను ఆపేసింది. అయితే మరో ప్రత్యేక ఎఫ్‌డీ అమృత్ వృష్టిని కొనసాగిస్తున్నది. ఇందులో డిపాజిట్‌దారులకు మరింత వడ్డీ ఆదాయం లభిస్తుండటం విశేషం. దీని కాలపరిమితి 444 రోజులు. రెగ్యులర్ ఇన్వెస్టర్లకు వార్షిక వడ్డీరేటు 7.25 శాతం వర్తిస్తుంది. సీనియర్ సిటిజన్లకు మాత్రం 7.75 శాతం వడ్డీ వస్తుంది. ఇక 80 ఏండ్లు దాటినవారికైతే ఇది 7.85 శాతంగా ఉండటం గమనార్హం.

### ప్యాట్రన్స్, వుయ్-కేర్

ఎస్బీఐ పరిచయం చేసిన కొత్త టర్మ్ డిపాజిట్ సదుపాయమే ఈ 'ప్యాట్రన్స్'. 80 ఏండ్లు, ఆపై వయసు కలిగినవారికే ఈ ప్రత్యేక ఎఫ్‌డీ అందుబాటులో ఉంటుంది. దీనిపై వార్షిక వడ్డీరేటు గరిష్ఠంగా 10 శాతం అందుకోవచ్చు. అలాగే 'వుయ్-కేర్' పేరిట 5-10 ఏండ్ల ఎఫ్‌డీలకు సీనియర్ సిటిజన్ల కోసం 7.50 శాతం వడ్డీనిస్తున్నది.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
7 ఏప్రిల్
2025



# సన్‌రైజర్స్‌కు నాలుగో ఓటమి

## సొంతగడ్డపై చెలరేగిన సిరాజ్

## గిల్ అర్ధసెంచరీ గుజరాత్ హ్యాట్రిక్

**సొంత మైదానంలోనైనా అదరగొట్టేస్తుందేమోనని ఆశించిన సన్‌రైజర్స్ అభిమానులకు నిరాశే ఎదురైంది. తాము దూకుడుగానే ఆడతామని కెప్టెన్ ప్యాట్ కమిన్స్ టాస్‌కు ముందు బీరాలు పలికినా.. పేసర్ సిరాజ్ కెరీర్ బెస్ట్ బౌలింగ్ (4/17)కు బ్యాటింగ్ ఆర్డర్ చెల్లాచెదురైంది. ఇక హైదరాబాద్ బౌలింగ్‌లోనూ పస లేకపోవడంతో గుజరాత్ టైటాన్స్ ఆడుతూ పాడుతూ హ్యాట్రిక్ విజయాన్ని పూర్తి చేసింది.**



హైదరాబాద్: అన్ని విభాగాల్లో విఫలమైన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వరుసగా నాలుగో ఓటమి. అటు వేదిక ఏదైనా విజయమే లక్ష్యంగా గుజరాత్ టైటాన్స్ చెలరేగుతోంది. ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్న టైటాన్స్ ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ ఓటమితో రైజర్స్ తమ ఆఖరి స్థానాన్ని మరింత పదిలపర్చుకున్నట్టయ్యింది. అలాగే ఎస్‌ఆర్‌హెచ్‌పై గిల్ సేనకిది వరుసగా నాలుగో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 152 పరుగులు చేసింది. నితీశ్ (31), క్లాసెన్ (27), కమిన్స్ (22 నాటౌట్) మాత్రమే రాణించారు. సిరాజ్‌కు నాలుగు.. సాయికిశోర్, ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 16.4 ఓవర్లలో 3 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. గిల్ (43 బంతుల్లో 9 ఫోర్లతో 61 నాటౌట్) తుదికంటా నిలవగా.. సుందర్ (29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 49), రూథర్‌ఫోర్డ్ (16 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 35 నాటౌట్) వేగంగా ఆడారు. షమికి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సిరాజ్ నిలిచాడు.

**గిల్-సుందర్ అండతో..:**

స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన టైటాన్స్ తొలి ఐదు ఓవర్లలో చేసింది 28 పరుగులే. పైగా నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ సాయిసుదర్శన్ (5), బట్లర్ (0)ల వికెట్లను కూడా కోల్పోయింది. ఈ స్థితిలో మ్యాచ్ రసవత్తరంగాసాగే అవకాశం ఉందనిపించింది. కానీ నాలుగో నెంబర్‌లో బరిలోకి దిగిన వాషింగ్టన్ సుందర్ ఒక్కసారిగా సీన్ మార్చేశాడు. ఆరో ఓవర్‌లో అతడు 20 పరుగులు సాధించి టైటాన్స్‌లో జోష్ నింపాడు. అనంతరం గిల్-సుందర్ జోడీ



ఎలాంటి ఇబ్బందీ లేకుండా ముందుకు సాగింది. 36 బంతుల్లో గిల్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. మూడో వికెట్‌కు 90 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేశాక షమి ఓవర్‌లో సుందర్ అవుటయ్యాడు. అనికేత్ ఈ క్యాచ్‌ను పట్టడానికి ముందు బంతి నేలకు తాకినట్టు కనిపించినా థర్డ్ అంపైర్ అవుటివ్వడం చర్చనీయాంశమైంది. ఇక అభిషేక్ ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ 18 రన్స్ రాబట్టడంతో రైజర్స్‌కు ఏమూలో ఉన్న ఆశలు కూడా అడుగంటాయి. 16వ ఓవర్‌లో గిల్ రెండు ఫోర్లతో సమీకరణం 24 బంతులు 12 పరుగులకు మారింది. కానీ రూథర్‌ఫోర్డ్ 6,4తో మరో 20 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

**సిరాజ్ హవా:**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌ను టైటాన్స్ బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా పేసర్ సిరాజ్.. పవర్‌ప్లే, డెత్ ఓవర్లలో వికెట్ల వేట సాగించాడు. మొదటి 12 ఓవర్లపాటు వీరి ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ కూడా నమోదు కాకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఆఖరి ఓవర్‌లోనే అత్యధికంగా 17 పరుగులు సమకూరాయి. నితీశ్-క్లాసెన్ జోడీ కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. రెండు వరుస ఫోర్లతో జోష్ నింపిన ఓపెనర్ హెడ్ (8)ను ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే పేసర్ సిరాజ్ దెబ్బతీశాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ అభిషేక్ (18), ఇషాన్ (17) బౌండరీలతో స్కోరును ముందుకు తీసుకెళ్లారు. కానీ ఐదో ఓవర్‌లో ఒకే పరుగిచ్చి అభిషేక్‌ను సిరాజ్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 45/2 స్కోరుకే పరిమితమైంది. ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో క్రీజులో ఉన్న నితీశ్, క్లాసెన్ కుదురుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. దీంతో 5-10 ఓవర్ల మధ్య వీరి నుంచి ఒక్క ఫోర్ కూడా నమోదు కాలేదు. చివరకు 11వ ఓవర్‌లో నితీశ్ రెండు ఫోర్లు సాధించగా, 13వ ఓవర్‌లో క్లాసెన్ 4,6తో ఆకట్టుకున్నాడు. ఇక ట్రాక్‌లోకి వచ్చాడనుకున్న క్లాసెన్‌ను సాయికిశోర్ ఫ్లాట్ డెలివరీతో బౌల్డ్ చేశాడు. దీంతో నాలుగో వికెట్‌కు 50 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు భారీ షాట్‌కు ప్రయత్నించిన నితీశ్‌ను సాయికిశోర్.. కమిందు (1)ను ప్రసిద్ధ్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చారు. కానీ 19వ ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చిన సిరాజ్ కళ్లు చెదిరే ఇన్‌స్వింగ్ యార్కర్లతో అనికేత్, సిమర్జీత్ (0) వికెట్లను పడగొట్టాడు. అయితే ఆఖరి ఓవర్‌లో కమిన్స్ 4,6.. షమి (6 నాటౌట్) 4తో సన్‌రైజర్స్ స్కోరు 150 దాటగలిగింది.


**స్కోరుబోర్డు**

హైదరాబాద్: అభిషేక్ (సి) తెవాటియా (బి) సిరాజ్ 18బీ హెడ్ (సి) సాయి సుదర్శన్ (బి) సిరాజ్ 8బీ ఇషాన్ (సి) ఇషాంత్ (బి) ప్రసిద్ధ్ 17బీ నితీశ్ (సి) రషీద్ (బి) సాయికిశోర్ 31బీ క్లాసెన్ (బి) సాయికిశోర్ 27బీ అనికేత్ (ఎల్బీ) సిరాజ్ 18బీ కమిందు (సి) సాయి సుదర్శన్ (బి) ప్రసిద్ధ్ 1బీ కమిన్స్ (నాటౌట్) 22బీ సిమర్జీత్ (బి) సిరాజ్ 0బీ షమి (నాటౌట్) 6బీ ఎక్స్‌ట్రాలు: 4బీ మొత్తం: 20 ఓవర్లలో 152/8. వికెట్ల పతనం: 1-9, 2-38, 3-50, 4-100, 5-105, 6-120, 7-135, 8-135బీ బౌలింగ్: సిరాజ్ 4-0-17-4బీ ఇషాంత్ శర్మ 4-0-53-0బీ ప్రసిద్ధ్ కృష్ణ 4-0-25-2బీ రషీద్ ఖాన్ 4-0-31-0బీ సాయి కిశోర్ 4-0-24-2.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) అనికేత్ (బి) షమి 5, గిల్ (నాటౌట్) 61, బట్లర్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 0, సుందర్ (సి) అనికేత్ (బి) షమి 49, రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 35, ఎక్స్‌ట్రాలు: 3 బీ మొత్తం 16.4 ఓవర్లలో 153/3 బీ వికెట్లపతనం : 1-15, 2-16, 3-106 బీ బౌలింగ్: షమి 4-0-28-2, కమిన్స్ 3.4-0-26-1, సిమర్జీత్ సింగ్ 1-0-20-0, ఉనాద్కట్ 2-0-16-0, జీషన్ అన్సారీ 4-0-33-0, కమిందు మెండిస్ 1-0-12-0, అభిషేక్ శర్మ 1-0-18-0.

# బుమ్రా సిద్ధం

## బెంగళూరుతో నేటి మ్యాచ్ బరిలో..



ముంబై : భారత జట్టు స్టార్ పేసర్ బుమ్రా ఐపీఎల్ బరిలో దిగుతున్నాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో సోమవారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో బుమ్రా ఆడనున్నాడు. ఈమేరకు అతడు ముంబై ఇండియన్స్ జట్టులో చేరాడు. గత జనవరిలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఐదో, చివరి టెస్ట్ సందర్భంగా బుమ్రా వెన్ను గాయానికి లోనైన సంగతి తెలిసిందే. దాంతో చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. 'బెంగళూరుతో సోమవారం జరిగే మ్యాచ్‌లో బుమ్రా బరిలోకి దిగుతున్నాడు. ఆదివారంనాడు అతడు సాధన చేశాడు' అని ముంబై ఇండియన్స్ కోచ్ మహేల జయవర్ధనే వెల్లడించాడు. ఇక..మోకాలి గాయంతో లఖ్‌నవూతో గత మ్యాచ్‌కు దూరమైన రోహిత్ శర్మ వాంఖడేలో ఆదివారం నెట్ ప్రాక్టీస్ చేశాడు. 'రోహిత్ నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేశాడు. కానీ బ్యాటింగ్ సమయంలో సౌకర్యంగా లేదు' అని జయవర్ధనే తెలిపాడు.

# రోహిత్‌తో ఆటను ఆస్వాదిస్తా..: కోహ్లీ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలది ప్రత్యేక స్థానం. దశాబ్దాలుగా ఇద్దరూ కలిసి ఆడుతుండడంతో పాటు ఎన్నో విజయాలు అందించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రోహిత్‌తో కలిసి ఆడడాన్ని ఎంతగానో ఆస్వాదించినట్టు విరాట్ తెలిపాడు. 'ఇద్దరం దాదాపు ఒకేసారి జట్టులోకి వచ్చాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు మాది సుదీర్ఘ ప్రయాణం. కలిసి ఆడాం.. కలిసి నేర్చుకున్నాం. ఎన్నో ఆలోచనలను పంచుకున్నాం. అలాగే ఒకరిపై మరొకరం నమ్మకం ఉంచుతూ జట్టు విజయాల కోసం తోడ్పడ్డాం. ఈ క్రమంలో మా మధ్య ఎన్నో మధుర స్మృతులున్నాయి. వాటన్నింటినీ ఎంజాయ్ చేశాను' అని విరాట్ పేర్కొన్నాడు.



# హితేశ్‌కు స్వర్ణం

## బాక్సింగ్ కప్‌లో భారత్‌కు 6 పతకాలు

ఢిల్లీ: బ్రెజిల్ వేదికగా జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. ఒక స్వర్ణం, ఒక రజతంతో పాటు నలుగురు బాక్సర్లు కాంస్య పతకాలు సాధించారు. శనివారం రాత్రి జరిగిన పురుషుల 70 కిలోల విభాగంలో హితేశ్.. ఒడెల్ కమర (ఇంగ్లండ్)పై గెలిచి పసిడి గెలుచుకున్నాడు. ప్రత్యర్థి గాయంతో రింగ్ నుంచి తప్పుకోవడంతో హితేశ్ విజేతగా నిలిచాడు. అతడితో పాటు పురుషుల 65 కిలోల విభాగంలోనూ ఫైనల్ చేరిన మరో బాక్సర్ అభినాష్.. ఫైనల్‌లో యురి



రీస్ (బ్రెజిల్) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీలో జదుమణి సింగ్, మనీశ్ రాథోడ్, సచిన్, విశాల్ కూడా తమ విభాగాల్లో కాంస్యాలు సాధించి సత్తా చాటారు. ఈ పోటీలలో పది మంది బృందంతో బరిలో నిలిచిన భారత్.. ఆరు పతకాలతో సత్తా చాటడం విశేషం.

# రిటైర్మెంట్.. ఇప్పుడే కాదు..!

## స్పష్టతనిచ్చిన ధోనీ



న్యూఢిల్లీ: తన ఐపీఎల్ రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలను ధోనీ కొట్టిపడేశాడు. ఈ సీజన్ చివరి వరకు ఆడతానని స్పష్టం చేశాడు. శనివారం చెపాక్‌లో ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌కు మహీ తల్లిదండ్రులు హాజరు కావడంతో అతడికి ఇదే చివరి మ్యాచ్ అనే వార్తలు నెట్‌లో హల్‌చల్ చేశాయి. కానీ, మ్యాచ్ ముగిసిన తర్వాత మహీ ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకొన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో తన రిటైర్మెంట్ ఊహాగానాలను ధోనీ ఖండించాడు. 'ఇప్పటికిప్పుడు లీగ్‌కు గుడ్‌బై చెప్పలేను. ఈ సీజన్ ముగిసిన తర్వాత.. జూలైలో 44వ సంవత్సరంలోకి అడుగుపెడతా. ఇంకా ఆడా లా? వద్దా? అనే నిర్ణయం తీసుకోవడానికి అప్పటికి మరో 10 నెలల సమయం ఉంటుం ది. నా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకొనేది నేను కాదు.. నా శరీరం. సీజన్ ఆరంభానికి ముం దు శరీరం సహకరిస్తుంటే ఆడతా. లేకపోతే గుడ్‌బై చెబుతాన'ని ధోనీ చెప్పాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News




## నెం.1 పొజిషన్ లో ఉండటం అంత ఈజీ కాదు

చాంద్ సా రోషన్ చెహ్రా మూవీతో నటిగా అడుగుపెట్టిన తమన్నా అప్పుడే సినీ ఇండస్ట్రీలో 20 ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం తమన్నా తెలుగులో ఓదెల2 సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఏప్రిల్ 17న రిలీజ్ కానుంది. ఓదెల రైల్వే స్టేషన్ కు సీక్వెల్ గా తెరకెక్కిన ఈ సినిమాకు అశోక్ తేజ దర్శకత్వం వహించగా సంపత్ నంది కథ అందించారు.

ఓదెల2 రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్ లో పాల్గొంటున్న తమన్నా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించింది. నటనను తానెప్పుడూ జాబ్ గా చూడలేదని, తాను చేస్తున్న ప్రతీ పనినీ ఎంజాయ్ చేస్తూ చేశానని, అందుకే ఎప్పుడూ ఏ సినిమా విషయంలో తన నటన కష్టంగా అనిపించలేదని తమన్నా తెలిపింది. టెన్త్ క్లాస్ లోనే సినిమాల్లోకి వచ్చిన తమన్నాకు స్టడీస్ లో టీచర్లు ఎంతో హెల్ప్ చేసేవారట. ఒక్కోసారి ఆమె అసైన్‌మెంట్స్ కూడా టీచర్లే రాసేవారని చెప్తోన్న తమన్నా, రియల్ లైఫ్ లో తాను కాలేజ్ కు వెళ్లలేదని, కానీ రీల్ లైఫ్ లో కాలేజ్ స్టూడెంట్ గా చాలానే సినిమాలు చేశానని, ఇండస్ట్రీలోకి వచ్చి అప్పుడే 20 ఏళ్లు అవుతుందంటే నమ్మబుద్ధి కావడం లేదని, కెరీర్ మొదలుపెట్టిన కొత్తల్లో ఇన్ని ఏళ్లు ఇండస్ట్రీలో ఉంటాననుకోలేదని తమన్నా అంటోంది. ఈ సందర్భంగా తమన్నా తన 21వ సంవత్సరంలో జరిగిన ఓ సంఘటనను గుర్తు చేసుకుంది. తన బర్త్ డే సందర్భంగా ఒక రోజు షూటింగ్ నుంచి బ్రేక్ తీసుకుని ఇంట్లో ఉన్నానని, అప్పుడు న్యూస్ పేపర్లో తనపై ఓ న్యూస్ ఆర్టికల్ వచ్చిందని, అందులో తనను తమిళంలో నెం.1 నటి అని రాశారని చెప్పుకొచ్చింది. అయితే ఆ వార్త చదవగానే తాను కన్నీళ్లు పెట్టుకున్నానని చెప్తోన్న తమన్నా, అంత త్వరగా ఆ స్థానానికి వెళ్తాననుకోలేదని అందుకే అది చూడగానే ఏడ్చానని తెలిపింది. అయితే నెం.1 ప్లేస్ లో ఉండటం అంత ఈజీ కాదని తెలుసుకున్న అమ్మడు దాన్ని ఒక బాధ్యతగా తీసుకుని మంచి సినిమాలు చేసి ఆడియన్స్ ను అలరించాలనుకున్నట్టు చెప్పింది.



## దివి.. ఇంత అందంగా కనిపిస్తే ఎలా..

తెలుగు ప్రేక్షకులకు 'బిగ్ బాస్' ద్వారా పరిచయమైన దివి వాద్య సొగసుల తారగా ఎదుగుతున్న నటి. గ్లామర్‌కు తగ్గటే, తను ఎంచుకునే డ్రెస్‌లు, ఫోటోషూట్లు, స్టైలింగ్ అన్నీ ప్రత్యేకంగా ఆకట్టుకుంటూ ఉంటాయి. తాజాగా ఆమె పంచుకున్న ట్రెడిషనల్ అవతార్‌లోని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీలి లెహంగా, మల్టీ కలర్ హ్యాండ్లూమ్ చోళితో దివి చేసిన ఈ ఫోటోషూట్ చాలా అందంగా ఉంది.

చేతులను పైకి ఎత్తుతూ తీసుకున్న స్టిల్స్‌లో ఆమె స్టైల్, ఫీల్ చూసినవాళ్లను కట్టిపడేస్తోంది. 'నువ్వు చూసి వెళ్ళిపోతావు.. నీకు కనపడని దృశ్యాలా మేము మిగిలిపోతాం' అంటూ క్యాప్షన్ కూడా వైరల్ అవుతుండడం విశేషం. దివి కెరీర్‌పై ఓ లుక్కేస్తే.. 'మహర్షి' సినిమాలో చిన్న పాత్రలో కనిపించిన తర్వాత బిగ్ బాస్-4లో భాగమైంది. అక్కడ తన అందం, స్వభావంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

ఆ తర్వాత 'లంబసింగి' అనే సినిమాతో హీరోయిన్‌గా మారిన దివి, ప్రస్తుతం పలు ప్రాజెక్ట్స్‌లో కూడా భాగమైందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె సోషల్ మీడియా యాక్టివిటీ ఒక ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ అయి-ంతే ఉంది. ట్రెడిషనల్ లుక్స్, మోడ్రన్ ఫోటోషూట్లు.. ఇలా విభిన్నంగా కనిపిస్తూ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తాజాగా ఆమె చేసిన ఈ లెహంగా ఫోటోషూట్‌లోని ఫొటోలే ఇందుకు నిదర్శనం. ప్రతి ఫ్రేమ్‌లోనూ దివి ఒక నెమలి అందంతో మెరిసిపోతోంది.



## మత్తు కళ్లతో చిత్తు చేసిన షామా


తనదైన అందం ఆకర్షణతో షామా శికందర్ యువతరంలో భారీ ఫాలోయింగ్ ని తెచ్చుకుంది. బుల్లితెర నటిగా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఫ్యాన్స్ తనను వోన్ చేసుకున్నారు. తనకు ఉన్న ఫాలోయింగ్‌కి తగ్గట్టే ఇన్ స్టా వేదికపై నిరంతర ట్రీట్ కి ప్లాన్ చేస్తోంది ఈ బ్యూటీ. షామా తాజాగా షేర్ చేసిన ఓ ఫోటోషూట్‌లో వైట్ బాడీ కాన్ డ్రెస్‌లో మతులు చెడగొట్టింది. శరీరాన్ని అందంగా అల్లుకుపోయిన ఈ గౌన్ .. షామా ఎక్స్ ప్రెషన్స్ గురించి బోయ్స్ విస్తృతంగా చర్చిస్తున్నారు. ఈ అందమైన ఫోటోగ్రాఫ్ కి అద్భుతమైన క్యాప్షన్ ని షామా ఇచ్చింది. ఈ ఫోటోగ్రాఫ్ నలుపు, తెలుపు కావచ్చు, కానీ నన్ను నమ్మండి, ఆ క్షణం రంగులతో నిండి ఉంది... అని ఫోటోకి క్యాప్షన్ రాసింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది.

షామా కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కేవలం 17 సంవత్సరాల వయసులో గ్లామర్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ. తనదైన అందం నటప్రతిభతో పెద్ద నిర్మాతలు దర్శకుల దృష్టిని ఆకర్షించింది. 1999లో ఆమిర్ ఖాన్- మనీషా కొయిరాలాతో కలిసి మన్ చిత్రంలో నటించే అవకాశం లభించింది. ఇంద్రకుమార్ ఈ చిత్రానికి దర్శకుడు. ఇది షామాకు ఒక గొప్ప అరుదైన క్షణం. ఆ తర్వాత వరసగా క్రేజీ ప్రాజెక్టులు లభించాయి. తరువాత యే మొహబ్బత్ హై, అన్ష్: ది డెడ్లీ పార్ట్, బస్తీ, ధూమ్ దడక్కా, కాంట్రాక్ట్, బైపాస్ రోడ్ సహా మరెన్నో హిట్ చిత్రాలలో నటించింది. నేడు సోషల్ మీడియాల్లో భారీ క్రేజ్ ఉన్న బ్యూటీగా వెలిగిపోతోంది. విదేశీ ప్రియుడు జేమ్స్ మిల్లిరాన్ తో ఈ భామ జీవితం హాయిగా, లగ్జరియస్ గా సాగిపోతోంది.

## బ్యాంకాక్ కొండలు కోనల్లో యువనటి గట్స్

పచ్చని ప్రకృతిని ఆస్వాధించే మనసుండాలే కానీ ఈ ప్రపంచంలో ఎగ్జోటిక్ లొకేషన్లకు కొదవేమీ లేదు. అందునా బ్యాంకాక్ అడవుల్లో సుదూర తీరాన పచ్చందాలను తనివి తీరా ఆస్వాధించి తీరాల్సిందే. అక్కడ కొండలు కోనలు గుట్టలు నదీ సముద్ర జలాల్లో విహరిస్తే కలిగే మజానే వేరు! ప్రస్తుతం అలాంటి అద్భుతమైన విహారయాత్రను ఆస్వాధిస్తోంది మెహ్రీన్ ఫీర్జదా.

తాజాగా కొండల మధ్య పచ్చని జలాల్లో బోట్ షికార్ చేస్తూ కనిపించింది. ఎత్తైన పర్వతాల నడుమ పచ్చని నీడ ఆ నది నీటిలో ప్రతిబింబిస్తోంది. అలాంటి చోట మెహ్రీన్ తనను తాను మర్చిపోయి ఇదిగో ఇలా ఫోజులిచ్చింది. హాఫ్ షోల్డర్ ఫ్రాక్ లో థై అందాలను కూడా ప్రదర్శిస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం మెహ్రీన్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. చేతిలో సినిమాల్లేవ్. కావాల్సినంత తీరిక సమయం ఉంది. దానిని ఇలా సద్వినియోగం చేస్తోందంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986